TGTEL/25/A0827
# ప్రజా దివాస్
తెలుగు దినపత్రిక
prajadivvs57@gmail.com

## విలేఖరులు కావలెను
అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ ... ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా.. ? బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా ... ? అయితే రండి ... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..
సెల్ : 9440060406
నియోజకవర్గ ఇంచార్జ్‌లు, జిల్లా స్టాఫర్‌లు మండల రిపోర్టల్‌లు కావలెను...

సంపుటి : 3 సంచిక : 223 | బుధవారం 05-08-2026 | ఎడిటర్: ఎస్ ఎన్ డి మౌనిక రవికుమార్ | పేజీలు : 8 వెల 3 /-

ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు కీలక వ్యాఖ్యలు

# ఇజ్రాయెల్ గొప్ప స్నేహితుల్లో మోదీ ఒకరు: నెతన్యాహు



భారత్ మా ముఖ్యమైన భాగస్వామి • సంబంధాలు మరింత బలోపేతం చేసుకుంటాం

- మోదీ మా గొప్ప స్నేహితుల్లో ఒకరు.
- భారత్‌తో సంబంధాలు మరింత బలోపేతానికి కృషి చేస్తున్నాం.
- ఇజ్రాయెల్ ఏకాకి అనే విమర్శలకు భారత్ మద్దతు స్ఫూర్తినిస్తోంది.
- రక్షణ, సాంకేతికత, వాణిజ్యం, ఆరోగ్యం, వ్యవసాయం తదితర రంగాల్లో సహకారం.
- ప్రపంచవ్యాప్తంగా మారుతున్న భౌగోళిక రాజకీయ పరిస్థితుల్లో భారత్‌తో భాగస్వామ్యం మరింత కీలకం.

"మోదీ మా గొప్ప స్నేహితుల్లో ఒకరు. భారత్ మా ముఖ్యమైన భాగస్వామి. మాకు భారత్ నుంచి మద్దతు ఉంది."
-- బెంజమిన్ నెతన్యాహు,

ఇరు దేశాల మధ్య కీలక పరిణామం



2లో

2026 ఫిబ్రవరిలో ప్రధాని మోదీ ఇజ్రాయెల్ పర్యటనలో పలు కీలక ఒప్పందాలు కుదిరాయి.ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, కీలక ఖనిజాలు, రక్షణ, వాణిజ్యం, కార్మిక, ఆరోగ్య రంగాల్లో సహకార ఒప్పందాలు కుదిరాయి.

భారత్-ఇజ్రాయెల్ బలోపేతమవుతున్న బంధం

| | | | | |
|---|---|---|---|---|
| రక్షణ సహకారం ఆధునిక ఆయుధాలు సంయుక్త పరిశోధనలు | ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సైబర్ సెక్యూరిటీ అధునాతన సాంకేతిక రంగాల్లో భాగస్వామ్యం | వాణిజ్యం & పెట్టుబడులు ద్వైపాక్షిక వాణిజ్యం వృద్ధి స్టార్టప్‌లు పరిశ్రమలలో | ఆరోగ్యం & వ్యవసాయం ఆరోగ్య సాంకేతికత నీటి నిర్వహణ వ్యవసాయ ఆవిష్కరణల్లో సహకారం | సంస్కృతి & ప్రజల మధ్య బంధాలు పర్యాటకం, విద్య, సాంస్కృతిక మార్పిడితో సంబంధాల బలోపేతం |

# డమ్మీ సీఎం.. జోకర్ క్యాబినెట్:

విజయ్ సర్కార్‌పై స్టాలిన్ ఘాటు విమర్శలు



నటి త్రిషను ఉద్దేశిస్తూ డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ పరోక్షంగా చేసిన వ్యాఖ్యలు తమిళనాట రాజకీయ దుమారం రేపాయి. ఇందుకు సంబంధించిన కేసులో ఆయన అరెస్టయి.. బెయిల్‌పై విడుదలయ్యారు. ఈ పరిణామాలపై ఉదయనిధి తండ్రి, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ స్పందిస్తూ.. సీఎం విజయ్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. అహంకారం వినాశనానికి దారితీస్తుందని, అది నిరంతరం కొనసాగితే.. మరింత వేగంగా పతనమవుతారని దుయ్యబట్టారు. విజయ్.. ఓ అసమర్థ నాయకుడని మండిపడ్డారు. ఈ మేరకు మాజీ సీఎం తన ఎక్స్ ఖాతాలో సుదీర్ఘ పోస్ట్ పెట్టారు.

2లో

## సింగరేణికి బీఆర్ఎస్ హయాంలో రూ.54వేల కోట్ల బకాయిలు: కిషన్‌రెడ్డి



- రూ.54 వేల కోట్ల బకాయిలు బీఆర్ఎస్ హయాంలోనే: కిషన్‌రెడ్డి
- సింగరేణిపై బహిరంగ చర్చకు సిద్ధమా? అని బీఆర్ఎస్‌కు సవాల్
- రాష్ట్రం నుంచి బకాయిలు వసూలు చేస్తాం అని స్పష్టం
- కేసీఆర్ కుటుంబం వల్లే సంస్థకు నష్టం అని ఆరోపణ
- మోదీపై అభ్యంతరకర పోస్టులు ఖండనీయం అన్నారు
- కేసు నమోదు చేసిన పోలీసులను బెదిరిస్తున్నారని ఆరోపించారు

దిల్లీ: సింగరేణికి ఎవరి హయాంలో నష్టం జరిగిందో చర్చించేందుకు బీఆర్ఎస్ సిద్ధమా? అని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సవాల్ విసిరారు. కేసీఆర్ కుటుంబం వల్ల ఆ సంస్థకు ఎంతో నష్టం జరిగిందని విమర్శించారు. దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణికి రూ. 54వేల కోట్ల బకాయిలు పెట్టిందని.. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆ మొత్తాన్ని వసూలు చేస్తామన్నారు.
ప్రధాని మోదీని విమర్శిస్తూ సోషల్ మీడియాలో కొందరు అభ్యంతరకర వీడియోలు పోస్ట్ చేశారని కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థను దెబ్బతీసేలా రెచ్చగొట్టే వీడియోలు పెట్టారన్నారు. హైదరాబాద్‌లో భాజపా కార్యకర్త సాయికిరణ్ గౌడ్ ఫిర్యాదుతో కేసు నమోదైందని చెప్పారు. కేసు నమోదు చేసిన పోలీసులను ప్రభుత్వం బెదిరిస్తోందని కిషన్‌రెడ్డి ఆరోపించారు.

# పోలీసు ఉద్యోగాల భర్తీ.. సీఎం రేవంత్‌కు ఇంటెలిజెన్స్ కీలక రిపోర్ట్



హైదరాబాద్: పోలీసు ఉద్యోగాల భర్తీపై సీఎం రేవంత్‌రెడ్డికి ఇంటెలిజెన్స్ వర్గాలు కీలక సమాచారం అందించాయి. నియామక ప్రక్రియను అడ్డుకోవాలని కొన్ని శక్తులు యత్నిస్తున్నాయని నిఘా వర్గాలు పేర్కొన్నాయి. ఈ క్రమంలో డీజీపీ సీవీ ఆనంద్, పోలీసు ఉన్నతాధికారులతో సీఎం అత్యవసరంగా చర్చించారు. భర్తీ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. నియమ నిబంధనలను అనుసరించి లోపాలు లేకుండా చూడాలని, ప్రశ్నపత్రాల తయారీ, ముద్రణ, రవాణాలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. కోచింగ్ సెంటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని దిశానిర్దేశం చేశారు. నియామక పరీక్షల నిర్వహణపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం అరికట్టాలన్నారు.

- పోలీసు నియామకాలపై సీఎం రేవంత్‌కు ఇంటెలిజెన్స్ కీలక సమాచారం.
- భర్తీ ప్రక్రియను అడ్డుకునే ప్రయత్నాలపై నిఘా హెచ్చరిక.
- డీజీపీ, ఉన్నతాధికారులతో సీఎం అత్యవసర సమావేశం.
- నియామకాలు పారదర్శకంగా, లోపాలు లేకుండా నిర్వహించాలని ఆదేశం.
- ప్రశ్నపత్రాల తయారీ, ముద్రణ, రవాణాలో అప్రమత్తంగా ఉండాలని సూచన.
- పరీక్షా కేంద్రాల్లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని ఆదేశం.
- కోచింగ్ సెంటర్లపై ప్రత్యేక నిఘా పెట్టాలని సూచన.

## మహేష్ కుమార్ గౌడ్‌కు హరీశ్ రావు లీగల్ నోటీసులు



హైదరాబాద్: టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు లీగల్ నోటీసులు పంపారు. తెలంగాణలో వర్షాలు పడకుండా హరీశ్ రావు ఆలయాలకు వెళ్లి క్షుద్రపూజలు చేశారంటూ మహేశ్‌కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలపై ఈ లీగల్ నోటీసులు పంపారు. ఆయన చేసిన వ్యాఖ్యలు పరువునష్టం కలిగించేలా ఉన్నాయని నోటీసుల్లో పేర్కొన్నారు. తనపై చేసిన తప్పుడు ఆరోపణలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు హరీశ్ రావు తరఫున ఆయన న్యాయవాది టీపీసీసీ చీఫ్‌కు నోటీసులు పంపారు.
రాజకీయ ప్రయోజనాల కోసం తన ప్రతిష్ఠను దెబ్బతీసే ఉద్దేశంతో తప్పుడు, నిరాధార ఆరోపణలు చేశారన్నారు. ఈ తరహా వ్యాఖ్యలపై ఇప్పటికే కాంగ్రెస్ నేతలు అద్దంకి దయాకర్, సామ రామ్మోహన్ రెడ్డికి లీగల్ నోటీసులు పంపినట్లు నోటీసుల్లో ప్రస్తావించారు. ఆలయాల దర్శనాన్ని వక్రీకరించి రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించడం ప్రజాస్వామ్య రాజకీయ చర్చల స్థాయిని దిగజార్చే చర్య అని విమర్శించారు. పరువునష్టం కలిగించేలా ఉన్న ఆ వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. తప్పుడు ఆరోపణలను సరిదిద్దుతూ స్పష్టమైన ప్రకటన విడుదల చేసి, బేషరతుగా క్షమాపణ చెప్పాలని నోటీసుల్లో పేర్కొన్నారు.

### జూన్ 2న హరీశ్‌రావు తిరుచ్చి ఎందుకు వెళ్లారు?: మహేశ్‌కుమార్ గౌడ్



హైదరాబాద్: క్షుద్రపూజలు చేయడం బీఆర్ఎస్‌కు అలవాటేనని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. ఇటీవల మాజీ మంత్రి హరీశ్‌రావు తిరుచ్చి, శివమొగ్గలోని ఆలయాలకు ఎందుకు వెళ్లారని ప్రశ్నించారు.

2లో

## నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో జల్ జీవన్ పనుల వేగం



- తీర ప్రాంత తాగునీటికి జల్ జీవన్ భద్రత
- లక్ష్యం దిశగా అమరజీవి జలధార మెగా వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుల పనులు
- రెండు ప్రాజెక్టుల కింద రూ.270 కోట్ల విలువైన పనులు పురోగతి
- 400 కిలోమీటర్లకు పైగా పైప్‌లైన్ నిర్మాణం పూర్తి
- నాణ్యత ప్రమాణాలను స్వయంగా పరిశీలిస్తా
- ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో జల్ జీవన్ మిషన్ ప్రాజెక్టుల పురోగతిపై పవన్ సమీక్ష

2లో

## సౌర విద్యుత్ కనెక్షన్లకు ప్రాధాన్యం

విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



సౌర విద్యుత్ ద్వారా లక్షలాది కనెక్షన్ల లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. రైతులకు పెద్ద ఎత్తున వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇస్తున్నామని చెప్పారు. భారీగా రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టులకు ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. విద్యుత్ రంగంపై ప్రభుత్వం ఇప్పటికే శ్వేతపత్రం విడుదల చేసిందని మంత్రి అన్నారు. పవర్ సెక్టార్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో పూర్తి వివరాలు ప్రజలకు తెలియజేశామన్నారు.

2లో

## సూపర్ ఎల్నినో వర్షాభావ పరిస్థితులపై ప్రతీ రైతుకు అవగాహన కలిగించాలి

అర్హులైన ప్రతీ రైతు, కౌలు రైతులు పంటల భీమా పథకంలో నమోదు కావాలి

- పేదల ఇళ్లను పొంది, ఏళ్లుగా పట్టించుకోని వారికి రద్దు చేసి, వాటిని అర్హులైన వారికికేటాయించాలి
- ఏలూరులో పారిశుద్ధ్యం మరింత మెరుగుపరచాలి
- జిల్లా సమీక్షా సమావేశంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ,జిల్లా ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్




2లో

సూపర్ ఎల్నినో కారణంగా వర్షాభావ పరిస్థితులపై క్షేత్రస్థాయిలో రైతాంగానికి అవగాహన కలిగించి ప్రత్యామ్నాయ పంటలు వేసే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మరియు ఏలూరు జిల్లా ఇంచార్జ్ మంత్రివర్యులు నాదెండ్ల మనోహర్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ లోని గోదావరి సమావేశపు హాలులో మంగళవారం జిల్లా సమీక్షా సమావేశం ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన జరిగింది. జిల్లాలో ఎల్నినో పరిస్థితులు, వర్షపాతం పరిస్థితులు, భూగర్భ జలాల స్థితి, 22ఏ మరియు దేవాదాయ శాఖ సంబందించిన

# సంపాదకీయం

## కాలానికి కత్తిరింపులు.. యుగాలకు కుదింపులు!

కాలాన్ని కత్తిరించవచ్చు! యుగాలను కుదించవచ్చు! వినటానికి ఇదంతా వింతగానూ అనిపించొచ్చు! కృతకంగానే కనిపించొచ్చు! కానీ ఈ కృతకత్వమే ఇప్పుడు మహాకార్యంలా సాగిపోతోంది. ఎన్సీఈఆర్టీ (నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిసెర్చ్ అండ్ ట్రెనింగ్) పాఠ్యపుస్తకాల్లో ఈ కృత్రిమ కత్తిరింపులు సాగిపోతూనే ఉన్నాయి. మరోవంక నగరాల పేర్లూ మారిపోతున్నాయి. ఎందుకు ఇదంతా జరుగుతోందని ప్రశ్నించుకుంటే ఒక దృష్టి కనపడుతుంది. చరిత్ర గురించి ఒక అంచనా స్పష్టమవుతుంది. కాలాల కత్తిరింపులకూ యుగాల కుదింపులకూ మూలాలన్నీ ఇందులోనే ఉన్నాయి. క్రీస్తుశకం 1200లకు ముందు మనకంతా స్వర్ణయుగమేననీ ఆ తర్వాతే బానిసయుగం మొదలైందనే అంచనాతోనే పాఠ్యపుస్తకాల్లో ఈ మార్పులు జరుగుతున్నాయి. బానిసయుగం క్రీస్తుశకం 1200లోనే ఎందుకు ప్రారంభమైందన్న భావనకు అనూహ్యమైన కారణమేమీ లేదు. ముస్లిం సుల్తానుల పాలనతో (1206) బానిసయుగం మొదలైందనే ఆలోచనే దీని వెనుక ఉంది. ఈ బానిస యుగాన్ని ముస్లిం పాలనకే పరిమితం చేయలేదు. బ్రిటిష పాలనకూ విస్తరించారు. కానీ ప్రధానంగా దాన్ని ముస్లిం నవాబులు, మొఘలు పాదుషాల పాలన చుట్టూ కేంద్రీకరించి, చరిత్ర పాఠాల్లో సంస్కరణలు మొదలుపెట్టారు. నవాబులు, పాదుషాల పాలనకు అధిక ప్రాధాన్యం ఇచ్చి మన చరిత్ర పాఠ్యపుస్తకాలను తయారుచేశారనీ.. అంటే బానిసయుగంపై అనుచితంగా దృష్టిపెట్టారనీ.. దీన్ని సవరించటమే తమ ఉద్దేశమని ఎన్సీఈఆర్టీ సమర్థించుకుంది. పాలకపార్టీ నేతలు కూడా దాన్నే పదేపదే చెప్పారు. మొత్తంమీద మన చరిత్రలో 700 సంవత్సరాల 'బానిసత్వం'పై 2014 తర్వాత చర్చ బాగా మొదలైంది. ప్రధాని మోదీ దీని గురించి పలుచోట్ల విపులంగా మాట్లాడారు. 'భారతదేశం సుమారు 700 సంవత్సరాలు బానిసత్వాన్ని అనుభవించింది. ఈ దీర్ఘకాల బానిసత్వం వల్ల మన ఆత్మవిశ్వాసం, మన సంస్కృతి, మన జాతీయ చైతన్యం దెబ్బతిన్నాయి. ఇప్పుడు ఆ బానిస మనస్తత్వం నుంచి పూర్తిగా బయటపడాలి. స్వతంత్ర భారతదేశం తన వారసత్వంపై గర్వపడుతూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి'. ఇవి ప్రధాని మోదీ అన్న మాటలు. ఇందులో 'మన ఆత్మవిశ్వాసం', 'మన సంస్కృతి', 'మన జాతీయ చైతన్యం' అన్న మూడు విషయాలు చాలా కీలకమైనవి. ఈ మూడు 700 సంవత్సరాల కాలంలో దారుణంగా దెబ్బతిన్నాయనటానికి చరిత్రలో మనకు ఆధారాలు దొరకవు. సంపద సృష్టించే శ్రామికవర్గాలు ఏ దశలోనూ ఆత్మవిశ్వాసాన్ని కోల్పోలేదు. రైతులు పంటలు పండిస్తూనే వచ్చారు. కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవటమూ మానలేదు. సంపదను పెంచటంలో అలసత్వాన్నీ ప్రదర్శించలేదు. పొగాకు, మిరపకాయ, మొక్కజొన్న, బంగాళాదుంప, టమాటా, బొప్పాయి, జీడిపప్పు, అనాసపండు, సీతాఫలం, పుచ్చకాయ, కర్బూజ, బాదం, పాలకూర, దానిమ్మ లాంటివన్నీ 'బానిసత్వ' కాలంలోనే విదేశాల నుంచి ఇక్కడకు వచ్చాయి. ఇవన్నీ రైతులు స్వీకరించి ఇక్కడ సాగుచేశారు. కొన్నిటిని విస్తృతంగానూ, కొన్నిటిని పరిమితంగానూ పండించారు. వస్త్రపరిశ్రమ అభివృద్ధికి విశేషంగా తోడ్పడిన చరఖా (స్పిన్నింగ్ వీల్), పత్తిని ఏకే విల్లు, తివాచీల అల్లిక, మెరుగుపూత పూసిన మట్టిపాత్రలు, బావుల నుంచి నీటిని తోడటాన్ని సులభతరం చేసిన పర్షియన్ చక్రం (ధునీ), కాగితం తయారీ, తుపాకులు, ఫిరంగుల నిర్మాణం, కమానులు, గుమ్మటాలు నిర్మించే శిల్పచాతుర్యం, సున్నపు గారా (లైమ్ మోర్టార్), ముద్రణ యంత్రం, ఇనుము--ఉక్కు పరిశ్రమల్లో నాణ్యతా ప్రమాణాలు పెరగటం లాంటివన్నీ 'బానిసత్వ' యుగంలోనే దేశంలో ప్రవేశించి విశేషమార్పులకు దోహదం చేశాయి. వ్యవసాయం, చేతివృత్తులు, పరిశ్రమల తీరును తీవ్రంగా ప్రభావితం చేసిన ఆ కొత్త సాంకేతిక పరిజ్ఞానాలను ఆత్మవిశ్వాసం కోల్పోయిన ప్రజలు అంత తేలికగా అందుకోలేరు. ప్రయోగశీలతే ఆత్మవిశ్వాసంపై ఆధారపడి ఉంటుంది.

పాలకులది ఇస్లాం మతం కాబట్టి, రాజకీయ కారణాలతో వారు కొన్నిచోట్ల గుళ్ళు, గోపురాలను ధ్వంసం చేసిన ఘటనలను దృష్టిలో పెట్టుకుని 700 సంవత్సరాల కాలాన్ని మన సంస్కృతి బాగా దెబ్బతిన్న యుగంగా భావించలేం. కులంపై ఆధారపడిన మన సామాజిక వ్యవస్థను ముస్లిం పాలకులు విచ్ఛిన్నం చేయలేదు. అలా విచ్ఛిన్నం చేయాల్సిన రాజకీయ అవసరం వాళ్లకి కనిపించలేదు. ఆ అవసరం ఉండి ఉంటే దాన్ని చేసి ఉండేవాళ్లేమో. ఏ యుగంలోనైనా రాజకీయ అవసరం దేన్నైనా చేయిస్తుంది. కులవ్యవస్థ వల్ల పన్నులను రాబట్టడం సులభం అయింది. శిస్తులు, పన్నులు వసూలుచేసే జమీందార్లూ రైతు కులాల నుంచే వచ్చారు. వాళ్లకు తోడుగా ఉండే మజుందార్లు, మున్సీలు, కరణాలు, కులకర్ణులు, దేశ్‌పాండేలు బ్రాహ్మణ కులాల నుంచే వచ్చారు. వీళ్లపైనే ఆధారపడి ముస్లిం పాలకులు అధికారాన్ని చలాయించారు.

ఏ సంస్కృతీ అంతర్ముఖంగా మారిపోకుండా ఉండదు. 700 ఏళ్లల్లో భారత్ అనేక సంస్కృతుల ప్రభావానికి లోనైంది. అన్యమతాల ప్రభావంతో సర్వం నాశనమైందనుకుంటే అంతా చీకటిగానే కన్పిస్తుంది. ఎంతో గొప్ప సాహిత్యాన్ని సృష్టించిన భక్తి ఉద్యమం ఆ 700 ఏళ్ల కాలంలోనే బలపడి ప్రజలపై విశేష ప్రభావాన్ని కలగజేసింది. బలవంతపు మతమార్పిడులు పెద్దఎత్తున జరిగి ఉంటే మన సమాజ ముఖచిత్రమే మారిపోయి ఉండేది. ఇక మధ్యయుగాల్లో జాతీయ చైతన్యం గురించి ఎక్కువగా చెప్పుకోటానికి ఉండదు. మనమందరం ఒక జాతికి చెందినవారమనే భావన మధ్యయుగాల్లో ఎక్కడా లేదు. ఇది భారతదేశానికి పరిమితమైంది కాదు. యూరపులోనూ ఆనాడు జాతీయ భావన లేదు. దేశమంతా అనేక రాజ్యాలుగా విడిపోయి ఉన్న కాలంలో మనమంతా భారతీయులమనే భావనని ఊహించలేం. జాతీయ భావన ఉంటే హిందూ పాలకులు ఏకమై ఉండేవారు. విదేశాల నుంచి వచ్చిన పాలకులకు వ్యతిరేకంగా సంఘటితం అయ్యేవారు. అదెప్పుడూ జరగలేదు. హిందూ పాలకులు ముస్లిం సైన్య విభాగాలను ఏర్పాటుచేసుకుని శత్రువులపై దండెత్తిన ఘటనలు బోలెడు ఉన్నాయి. ఆనాడు విధేయత కులాలకు, తెగలకు, చిన్న ప్రాంతాలకు మాత్రమే పరిమితమై ఉండేది.

ప్రతి యుగంలోనూ మంచీచెడులు ఉంటాయి. ఒక మతానికి చెందిన పాలకులందరినీ ఒకేగాటన కట్టటం సంకుచితమే అవుతుంది. మతదృష్టితో 700 సంవత్సరాల చరిత్రను కుదించివేసి, ఆ కాలంలో వచ్చిన మార్పులను విద్యార్థులకు సమగ్రంగా పరిచయం చేయకపోతే జరిగే నష్టమే ఎక్కువ. మనకు ఇష్టమున్నా లేకపోయినా మొఘలు సామ్రాజ్యకాలంలో దేశంలో ఎన్నో మార్పులు వచ్చాయి. పాలకుల మతం ఏదైనా పాలన జనరంజకంగా ఉందా? జనవినాశనంగా ఉందా? అన్నదే ప్రధానంగా చూడాలి. ప్రపంచ వస్తుసేవల ఉత్పత్తిలో (జీడీపీ) మొఘల్ పాలన ఉచ్చదశలో ఉన్నకాలంలో (1700) భారత్ వాటా 25శాతం ఉండేది. చైనా

## సూపర్ ఎల్నినో వర్షాభావ పరిస్థితులపై ప్రతీ

# రైతుకు అవగాహన కలిగించాలి

మొదటిపేజీ తరువాయి

తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, ఎమ్మెల్యేలు బడేటి రాధాకృష్ణయ్య (చంటి), చింతమనేని ప్రభాకర్, పత్సమట్ల ధర్మరాజు లతో కలిసి ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ సూపర్ ఎల్నినో కారణంగా జిల్లాలో సాధారణం కన్నా 34 శాతం తక్కువగా వర్షపాతం నమోదైందన్నారు. ఇతర జిల్లాలతో పోలిస్తే కొంత మెరుగుగా ఉన్నప్పటికీ జిల్లాలోని వర్షాభావ పరిస్థితులు ఉన్న 15 మండలాల్లో కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకుని, రైతులకు ఎటువంటి పంట నష్టం కలగకుండా వర్షాభావ పరిసితులపై నియోజకవర్గాలలో స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి రైతులకు అవగాహన కల్పించి, ప్రత్యామ్నాయ పంటలు వేసేలా చర్యలు తీసుకొని, పిఎండిఎస్ (ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్) కిట్లు అందించాలన్నారు. జిల్లాలో ఇప్పటికే 66 వేల 293 పిఎండిఎస్ కిట్లు రైతులకు అందించడం జరిగిందని, మరో 35 వేల కిట్లు అందించేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారులు మంత్రి ఆదేశించారు. ప్రత్యామ్నాయ పంటలు వేసే రైతులకు సబ్సిడీ పై విత్తనాలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా జిల్లాలోని అర్హులైన ప్రతీ రైతుని పంటల భీమా పథకంలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. గోదావరి, కృష్ణా డెల్టాలలో ముందుగా త్రాగునీటి ప్రాధాన్యత ఇవ్వాలని, శివారు ప్రాంతాలకు సైతం త్రాగునీరు అందేలా చూడాలని, అనంతరం మిగులు జలాలను సాగుకు వినియోగానికి ఇరిగేషన్ శాఖ అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు, సాగునీటి వినియోగదారుల సంఘాలు ప్రతినిధులతో కలిసి చర్చించి సాగునీటి సరఫరా విషయంలో నిర్ణయం తీసుకోవాలన్నారు. కాల్వల ద్వారా సాగునీటిని అక్రమంగా మోటార్ల ద్వారా దారిమళ్లించకుండా మండల స్థాయి నిఘా బృందాలు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో పేదల గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. గృహాలు మంజూరై, ఇంకా గృహాలు తీసుకోకుండా ఉన్న వారికి గృహాలు రద్దుచేసి, వాటిని అర్హులైన లబ్ధిదారులకు కేటాయించాలన్నారు. మంజూరైన గృహాలు తీసుకోవకుండా తాత్సారం చేసే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. జిల్లాలో పంచాయతీరాజ్, రహదారులు, భవనాల శాఖల పరిధిలోని రోడ్లకు మరమ్మతులు చేయాలనీ, గుంతలకు మరమ్మత్తులు చేయాలనీ మంత్రి పంచాయతీరాజ్, రహదారులు భవనాల శాఖ అధికారులను ఆదేశించారు. ఏలూరు నగరంలో పారిశుద్ధ్య పరిస్థితులు మరింత మెరుగుపరచాలన్నారు. రోడ్లపై చెత్త, డ్రైన్లలో మురుగునీరు నిల్వ ఉండకుండా చేసిన పారిశుద్ధ్య పనులు స్పష్టంగా కనపడేలా పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. 22ఏ వివాదాస్పద భూములకు సంబంధించి ప్రజల నుండి వినతులపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. వరదలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఎటువంటి ప్రాణ, ఆస్థి నష్టాలు కలగకుండా ముందుగానే పటిష్టమైన ప్రణాళిక రూపొందించి అమలు చేయాలన్నారు. డిఆర్సి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను తదుపరి సమావేశం నాటికి అధికారులు స్పష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. పిజిఆర్ఎస్ లో అందిన అర్జీలకు అత్యంత ప్రాధాన్యతను ఇచ్చి నాణ్యమైన పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ సూపర్ ఎల్నినో పరిస్థితులు, వర్షాభావ పరిస్థితులపై జిలాల్లోని రైతులకు తెలియజేసి కలిగించి ప్రత్యామ్నాయ పంటలు వేసేలా అవగాహన కలిగించామన్నారు. 22ఏ కేసుల పరిష్కారంలో ఏలూరు జిల్లా రాష్ట్రంలో ఆదర్శంగా నిలిచిందన్నారు. ఏలూరు శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి) మాట్లాడుతూ ఏలూరు నియోజకవర్గంలో పేదల ఇళ్ల నిర్మాణంలో ఇల్లు మంజూరైన కొందరు లబ్ధిదారులు వారికి నిర్మించిన ఇల్లు తీసుకోలేదని, వారి వివరాలు కూడా అధికారులకు తెలియడంలేదని, అటువంటి వారికి కేటాయించిన ఇళ్లను రద్దుచేసి, అర్హులైన వారికి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఏలూరు పట్టణంలో చిన్నపాటి వర్షానికే రోడ్లు జలమయం అవుతున్నాయని, డ్రైన్లలో సిల్ట్ తొలగించి ముంపును తొలగించాలని కోరారు. ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మురుగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు. దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ గత సమావేశంలో కోరిన కొప్పాక-పెదకడిమి బస్సు సర్వీస్ ఏర్పాటుపై కృతజ్ఞతలు తెలిపారు. బాపిరాజుగూడెం, విజయరాయి, నడింపల్లి, జానంపేట గ్రామాలలో విద్యార్థుల పాఠశాలల కోసం ఏలూరు నుండి వచ్చే సర్వీస్ ను 30 ని.ల ముందుగా ఏర్పాటుచేయాలని కోరారు. కొద్దగూడెం, తాళ్లగూడెం,, వీరమ్మకుంట, పెదపాడు బస్సును పునరుద్దరించాలన్నారు. పైడిచింతపాడు లో పేదల ఇళ్ల నిర్మాణంలో కాంట్రాక్టర్ మెటీరియల్, సొమ్మును తీసుకుని ఇళ్ళు కట్టలేదని, కాంట్రాక్టర్ నుండి రెవిన్యూ రికవరీ ఆక్ట్ కింద కేసు నమోదు చేయాలన్నారు. కుండా 2014-19 సమయంలో ఎన్టీఆర్ ఇల్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు బిల్లులు ఇంకా చెల్లించలేదని, సదరు బిల్లులు చెల్లింపునకు చర్యలు తీసుకోవలసిందిగా కోరారు. ఏలూరు-పూనుకొల్లు రోడ్డులు 4 బ్రిడ్జ్ ల నిర్మాణ పనులను పూర్తిచేయాలని కోరారు. ఉంగుటూరు శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు మాట్లాడుతూ ఉంగుటూరు నియోజకవర్గంలో క్రొవ్విడి రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని, రోడ్లు మంజూరు చేయాలనీ కోరారు. ఉంగుటూరు నియోజకవర్గంలో పేదల ఇళ్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ, నూజివీడు సబ్ కలెక్టర్ బి. వినూత్న, ట్రైనీ కలెక్టర్ శ్రావణ్ కుమార్ రెడ్డి, ఆర్డీఓ లు లక్ష్మి ప్రసన్న, రమణ, డిసిఎంఎస్ చైర్మన్ చాగంటి మురళీకృష్ణ (చిన్న) ఆర్టీసీ ప్రాంతీయ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, వడ్డీలు కార్పొరేషన్ చైర్ పర్సన్ ఘంటసాల వెంకటలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జూన్ 2న హరీశ్‌రావు తిరుచ్చి ఎందుకు వెళ్లారు?: మహేశ్‌కుమార్ గౌడ్

మొదటిపేజీ తరువాయి

గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడారు. "ఈ ఏడాది జూన్ 2న తిరుచ్చి, జులై 23న శివమొగ్గలోని ఆలయాలకు హరీశ్‌రావు వెళ్లారు. దీనికి సంబంధించిన ఆధారాలు ఉన్నాయి. ఆయా తేదీల్లో ఆయన ఎక్కడ ఉన్నారో చెప్పాలి. హరీశ్‌రావు దీనిపై స్పష్టత ఇవ్వాలి. ప్రజలు బీఆర్ఎస్‌ను నమ్మే పరిస్థితిలో లేరు. ఎంతో మంది త్యాగాలు చేస్తే తెలంగాణ వచ్చింది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లలో రాష్ట్రానికి చేసిందేమీ లేదు.. అందుకే ఆ పార్టీకి ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పారు. ఇప్పటికైనా క్షమించాలని తెలంగాణ ప్రజలను ఆ పార్టీ కోరాలి" అని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు.

## నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో జల్ జీవన్ పనుల వేగం

మొదటిపేజీ తరువాయి

మంగళగిరి, ఆగస్టు 4 : ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పరిధిలో జల్ జీవన్ మిషన్ కింద అమరజీవి జలధార ప్రాజెక్టు ద్వారా ఆయా జిల్లాల పరిధిలోని తీర ప్రాంత గ్రామాల తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం లభించనుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, గ్రామీణ తాగునీటి సరఫరా శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలో 33 లక్షల మందికి దాహార్తి తీర్చే బలమైన సంకల్పాన్ని ఈ ప్రాజెక్టుల ద్వారా ముందుకు తీసుకువెళ్తున్నామని తెలిపారు. నిర్ణీత గడువులోపు ముఖ్యమైన నిర్మాణాలు పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని అధికారులను ఆదేశించారు. నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అక్కడ జల్ జీవన్ పనుల వేగం మరింత పెంచాలని స్పష్టం చేశారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పరిధిలో చేపట్టిన జల్ జీవన్ మిషన్ ప్రాజెక్టుల పురోగతిపై పవన్ కళ్యాణ్ సమీక్షించారు. ఇన్ టేక్ వెల్స్, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, రిజర్వాయర్లతోపాటు పైప్‌లైన్ల నిర్మాణం వంటి కీలక పనుల పురోగతికి సంబంధించిన వివరాలపై ఆర్.డబ్ల్యూ.ఎస్. అధికారులతో సమీక్షించారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో రూ.3,050 కోట్లతో చేపట్టిన పనులు నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా సాగుతుండడంపట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పనుల పురోగతి వివరాలు ఈ సమీక్షలో పనుల వివరాలను అధికారులు తెలియజేశారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో రూ.1,650 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన మెగా వాటర్ గ్రిడ్ పథకాన్ని 10 నియోజకవర్గాల పరిధిలో సుమారు 20 లక్షల మందికి తాగునీరు అందించే లక్ష్యంతో ప్రారంభించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి రెండు ఇంటేక్ వెల్స్, యాక్సెస్ బ్రిడ్జిల నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నట్టు అధికారులు తెలిపారు. 111 ఓఒఆ, 75 ఓఒఆ సామర్థ్యాలతో ఏర్పాటు చేస్తున్న నీటి శుద్ధి కేంద్రాల్లో ఒకటి నిర్మాణ దశలో ఉన్నట్టు వివరించారు. ఇప్పటి వరకు ఈ ప్రాజెక్టు కోసం రూ.151 కోట్లకు పైగా ప్రభుత్వం వెచ్చించగా, 182 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ నిర్మాణం పూర్తయింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలో రూ.1,400 కోట్లతో చేపట్టిన ప్రాజెక్టు ద్వారా సుమారు 13.50 లక్షల మందికి తాగునీటి కష్టాలు తీరనున్నాయి. దీనికి సంబంధించి ఇంటేక్ వెల్, యాక్సెస్ బ్రిడ్జి, 155 మిలియన్ లీటర్ల సామర్థ్యం కలిగిన నీటి శుద్ధి ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయి.

# సౌర విద్యుత్ కనెక్షన్లకు ప్రాధాన్యం

మొదటిపేజీ తరువాయి

వైసీపీ హయాంలో విద్యుత్ వ్యవస్థ నిర్వీర్యం చేశారని విమర్శించారు. అధిక ధరలకు విద్యుత్ కొనుగోలు వల్ల నష్టాలు జరిగాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక విద్యుత్ రంగాన్ని గాడిలో పెట్టామని తెలిపారు. గత ఏడాది కొంతమేర విద్యుత్ ఛార్జీలు తగ్గించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్త సబ్‌స్టేషన్ల ఏర్పాటు కొనసాగుతోందని వెల్లడించారు. ట్రాన్స్‌మిషన్ లైన్ల విస్తరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని అన్నారు. గ్రీవెన్స్ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ప్రజల నుంచి వినతులు వచ్చాయని.. రెవెన్యూ, భూ, విద్యుత్, పెన్షన్ సమస్యలపై వినతులను స్వీకరించామన్నారు. జిల్లా కలెక్టర్లు, అధికారులు, ఎస్పీలతో సమన్వయం చేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అందిన అర్జీలన్నింటినీ త్వరితగతిన పరిష్కరిస్తామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ హామీ ఇచ్చారు.

# ఇజ్రాయెల్ గొప్ప స్నేహితుల్లో మోదీ ఒకరు: నెతన్యాహు

మొదటిపేజీ తరువాయి

ఇంటర్నెట్ డెస్క్: భారత ప్రధాని నరేంద్ర మోదీ పై ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ప్రశంసలు కురిపించారు. తమ దేశానికి ఉన్న గొప్ప స్నేహితుల్లో మోదీ ఒకరని పేర్కొన్నారు. భారత్‌ను తమ ముఖ్యమైన భాగస్వామిగా అభివర్ణించారు. ఇజ్రాయెల్ ఏకాకి అని చాలామంది విమర్శిస్తున్నారని.. కానీ తమకు భారత్ నుంచి మద్దతు ఉందన్నారు. ఆ దేశంతో సంబంధాలు మరింత బలోపేతం చేసుకోవడానికి కృషి చేస్తున్నామన్నారు. ప్రపంచవ్యాప్తంగా మారుతున్న భౌగోళిక రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో.. ఇజ్రాయెల్ భాగస్వామ్య దేశాల గురించి మాట్లాడుతూ నెతన్యాహు ఈ వ్యాఖ్యలు చేశారు.

ఇటీవలి కాలంలో ఇరుదేశాల మధ్య సంబంధాలు బలోపేతమయ్యాయి. రక్షణ, సాంకేతికత, వాణిజ్యం, విస్తృత వ్యూహాత్మక సహకారం, ఇతర రంగాలలో రెండు దేశాలు పరస్పర సహకారాన్ని పెంపొందించుకుంటున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో మోదీ.. ఇజ్రాయెల్ పర్యటనకు వెళ్లినప్పుడు పలు కీలక ఒప్పందాలు చేసుకున్నారు. వాటిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, కీలక ఖనిజాలు, రక్షణ, వాణిజ్యం, కార్మిక, ఆరోగ్య సంరక్షణ రంగాలలో సహకారం వంటివి ఉన్నాయి

# అమరావతి సెప్ట్ ఫైనాన్స్ ప్రాజెక్ట్

మొదటిపేజీ తరువాయి

సూర్యలంక గోవాకంటే మంచి టూరిజం ప్రాంతంగా మారుతుందని సీఎం చంద్రబాబు వివరించారు. ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు వచ్చినట్లే.. రాయలసీమ రాయల్‌గా మారుతుందని ఆకాంక్షించారు. ఇండియా ఎమర్జింగ్ నాలెడ్జ్ , సిమెంట్, స్టీల్, స్పేస్ సిటీ, డ్రోన్‌ల వంటి వాటిపై దృష్టిపెట్టామని వెల్లడించారు. స్వర్ణగిరి అశోకాకు 4వ రాజధానిగా పనిచేసిందని తెలిపారు. ఇప్పుడు జొన్నగిరిని స్వర్ణగిరిగా మార్చామని తెలిపారు. గ్లోబల్ హార్టీ కల్చర్ హబ్‌ను త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పుకొచ్చారు. దీనికోసం ప్రభుత్వ - ప్రైవేటు సపోర్టుతో లక్ష కోట్లకోసం ప్లాన్ చేస్తున్నామని పేర్కొన్నారు. మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ కాకుండా.. ఏపీ వన్ అనే యాప్‌ను కూడా సిద్ధం చేస్తున్నామని స్పష్టం చేశారు. ఈరోజు రాష్ట్రంలో నీటి శాతాన్ని మానిటర్ చేస్తున్నామని చెప్పుకొచ్చారు. పీపీపీ ఒక రియాలిటీ అని.. 390 ప్రాజెక్టులను పీపీపీ కింద కొనసాగిస్తున్నామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. ఇక్కడ పీపీపీ వద్దంటారని... భోగాపురం విమానాశ్రయం మాత్రం తమది అని వైసీపీ నేతలు చెబుతారన్నారు. భోగాపురం పీపీపీలో నిర్మించలేదా..? అని ప్రశ్నించారు. స్వయం బ్రాండ్ ద్వారా 60 అవుట్ సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా దీనిని ముందుకు తీసుకెళ్తున్నామని వెల్లడించారు. ఏపీలో ఎస్‌హెచ్‌జీ డిజిటలైజేషన్ పూర్తి అయిపోయిందని తెలిపారు. భారతదేశానికి అనేక సమస్యలు ఉన్నాయన్నారు. జేగురుపాడు ప్రాజెక్టు లీజు పూర్తి అవడంతో ప్రభుత్వానికి తిరిగి ఇచ్చేశారని తెలిపారు. నెల్లూరు, తిరుపతి గో÷-డలెన్ క్వార్డ్రలేటర్ విధానంలో పీపీపీ మోడ్‌లో అభివృద్ధి చేశామని వెల్లడించారు. భోగాపురం విమానాశ్రయం నుంచి హైదరాబాద్, చిత్తూరు, చెన్నై కనెక్టింగ్ సాధ్యమవుతుందని చెప్పుకొచ్చారు. పీ3 దేశానికి సంపద తెచ్చిందని.. ఇప్పుడు తాము పీ4 అమలు చేస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. పీ4 కింద 2లక్షల 40వేల మందికి హ్యాండ్ హోల్డింగ్ ఇస్తున్నామని చెప్పుకొచ్చారు. ఇది గేమ్‌ఛేంజర్ అవుతుందని తెలిపారు. తద్వారా హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఏపీ సాకారమవుతుందని ఉద్ఘాటించారు. వేల్ఫేర్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఇచ్చి వారికి ఎంపవర్‌మెంట్‌కు ఉపయోగిస్తున్నామని వివరించారు. వారి పిల్లలను ఉన్నత చదువులతో పాటు పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. బీసీలకు 118లక్షల లబ్దిదారులకు న్యాయం చేశామని స్పష్టం చేశారు. లిక్కర్ షాపులు, గనుల కేటాయంపుల్లో ప్రాధాన్యం కల్పించామని చెప్పుకొచ్చారు. మైనార్టీల సంక్షేమానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్‌లు డిఫెక్ట్ అయ్యాయని పేర్కొన్నారు. ఏపీకి 34శాతం ఆదాయం వ్యవసాయం నుంచి వస్తోందని.. లైవ్ స్టాక్, ఆక్వా నుంచి ఆదాయం వస్తోందని సీఎం చంద్రబాబు వెల్లడించారు. ప్యాడీ నుంచి వచ్చే ఆదాయం తక్కువ అని చెప్పుకొచ్చారు. అవసరమైన చోట ప్రకృతి సేద్యానికి వెళ్లాలని చెబుతున్నామని అన్నారు. 20 లక్షల ఎకరాలు న్యాచురల్ ఫార్మింగ్ కింద మనం చేస్తున్నామని వివరించారు. దీనికి సంబంధించి అవార్డు కూడా వచ్చిందని ప్రస్తావించారు. ప్రజాస్వామ్య దేశాల్లో ఎక్కడా సరైన నాయకత్వం లేదని.. కేవలం ఇండియాలోనే మాత్రమే ఉందని తెలిపారు. ఎల్‌నినో లాంటివి వచ్చినా నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి కాదని వైసీపీ హయాంలో వదిలేశారని.. కానీ అక్కడే అభివృద్ధి చేసి చూపిస్తున్నామని సీఎం చంద్రబాబు ఉద్ఘాటించారు. కొందరు డేటాసెంటర్ గురించి తెలియకుండా మాట్లాడుతున్నారని అన్నారు. పీపీపీ మోడ్‌లో ఆయా ప్రాజెక్టులు నిర్మిస్తే వద్దని చెబితే ఎలా అని ప్రశ్నించారు. విదేశాల్లో సాంకేతికతకు ఆయువుపట్టు లాంటి వ్యాలీలు వస్తుంటే ఎందుకు ఇండియాలో రాకూడదని ప్రశ్నించారు. వేల్ఫేర్ ఇవ్వాలనే వారు అభివృద్ధి గురించి పట్టించుకోవాలని.. ప్రజలు కూడా ఈ విషయాన్ని ఆలోచించాలని సూచించారు. అభివృద్ధి కోసం ప్రజల భాగస్వామ్యం ఏంటో కూడా ఆలోచించాలని అన్నారు. ప్రతిసంవత్సరం ఇలా ప్రజల ముందు ఉంచుతానని అన్నారు. దీనిపై చర్చ జరగాలని తెలిపారు. ప్రతి ప్రాజెక్టు ఎప్పటికీ పూర్తి అవుతుందనేది టైం లైన్ పెట్టి చెబుతామని స్పష్టం చేశారు. విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్‌లో 49 ప్రాజెక్టుల్లో రూ.10లక్షల కోట్ల పెట్టుబడి పెడితే 24 లక్షల ఉద్యోగాలు వస్తాయని చెప్పుకొచ్చారు. ఇండియాలో అత్యంత వేగంగా విశాఖపట్నం అభివృద్ధి చెందుతుందని వివరించారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై.. సీఎం చంద్రబాబు పరోక్షంగా సెటైర్లు వేశారు. గొడ్డలి పార్టీకి నేరాలు చేయడం అలవాటైందని ఎద్దేవా చేశారు. సీసీటీవీ ఫుటేజ్ సమీపంలో నేరాలు చేసి గొడ్డలి పార్టీ నేతలు దొరికి పోతున్నారని వ్యగ్యంగా మాట్లాడారు. 2019 నుంచి 2024 వరకు చివరకు ఆర్టీజీఎస్‌ను కూడా సర్వనాశనం చేశారని ధ్వజమెత్తారు. వ్యవస్థలు అన్నింటిని సర్వనాశనం చేశారని ఆగ్రహించారు. డెఫిసిట్ ÷నాన్స్‌ను కూడా 2026 వరకు వాడాల్సిన మొత్తాన్ని 2024లోనే వైసీపీ హయాంలో వాడారని మండిపడ్డారు. ఆ పార్టీ నేతలు చేస్తున్న నేరాలను తాము అడ్డుకుంటున్నామని.. వారి అరాచకాలను సాగనీవబోమని సీఎం చంద్రబాబు హెచ్చరించారు.

# డమ్మీ సీఎం.. జోకర్ క్యాబినెట్:

మొదటిపేజీ తరువాయి

"కావేరీ నదీ జలాలు, మేకెదాటు ప్రాజెక్ట్ వ్యవహారంలో తమిళనాడు హక్కులను అణచివేసేందుకు కేంద్రం ప్రయత్నిస్తోంది. దాన్ని ఖండించేందుకు తంజావూరులో డీఎంకే ఆందోళన కార్యక్రమం చేపట్టింది. అందులో ఉదయనిధి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. ఈ విమర్శలకు బదులుచెప్పే ధైర్యం రాష్ట్ర ప్రభుత్వాన్ని లేదు. అందుకే వాటిపై దృష్టి మరల్చేందుకు ఉదయనిధిని అరెస్ట్ చేసింది. మన



సీఎం విజయ్ కావేరీ నీటిని తీసుకురాలేరు. ఆయనో డమ్మీ సీఎం. ఇక, ఆయన మంత్రులు ఒక సినిమా (జననాయగన్‌ను ఉద్దేశిస్తూ)ను పట్టుకుని వేలాడుతున్నారు. రాష్ట్రంలో ఓ జోకర్ క్యాబినెట్ అధికారంలో ఉంది" అని స్టాలిన్ విమర్శించారు.

"శాసనసభలో ప్రతిపక్ష నేత హోదాలో ఉన్న ఉదయనిధి పట్ల పోలీసులు దారుణంగా వ్యవహరించారు. ఇంటికొచ్చి అరెస్టు చేసి.. తంజావూరుకు తీసుకెళ్లారు. కోర్టు విచారణ సందర్భంగా ఉదయనిధిని కస్టడీలోకి తీసుకొనే ఉద్దేశం లేదని ప్రభుత్వం తరఫు న్యాయవాది తెలిపారు. మరి అలాంటప్పుడు ఆయనను తంజావూరుకు ఎందుకు తరలించారు? ఎందుకు అన్ని కేసులు పెట్టారు. కోర్టు ఆదేశాలు ప్రభుత్వానికి చెంపపెట్టు" అని మాజీ సీఎం ఎద్దేవా చేశారు.

అధికారంలోకి వచ్చినప్పటి నుంచి.. తనను విమర్శిస్తున్న వారందరినీ విజయ్ అరెస్టు చేయిస్తున్నారని స్టాలిన్ దుయ్యబట్టారు. చెన్నైలోని మెరీనా బీచ్ వద్దకు ఆందోళనకారులను రానివ్వడం లేదని, నీట్ వ్యతిరేక ర్యాలీని కూడా అనుమతించట్లేదని ఆరోపించారు. శాసనసభ బడ్జెట్ సమావేశాలకు ముందు ఉదయనిధి అరెస్టు కుట్రపూరిత చర్యేనని స్టాలిన్ మండిపడ్డారు. అసెంబ్లీ సమావేశాలకు తమ నేతను దూరంగా ఉంచాలనే ఉద్దేశంతోనే ఉదయనిధిపై తప్పుడు కేసులు పెట్టించారని విమర్శించారు. తన కుమారుడు ఎవరిపైనా అభ్యంతరకర వ్యాఖ్యలు చేయలేదని, ఒకవేళ అలా చేసినట్లు నిరూపిస్తే తక్షణమే క్షమాపణలు చెబుతాడని స్టాలిన్ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. సీఎం విజయ్ ఇకనైనా రీల్స్ క్రియేట్ చేయడం మాని.. తన బాధ్యతలను గుర్తించి దానికి అనుగుణంగా వ్యవహరించాలన్నారు.

# ఏటీసీలతో ఉపాధి అవకాశాలు మెరుగు

**- యువతకు ఆధునిక శిక్షణ.. విదేశీ ఉద్యోగాలకు ప్రత్యేక ట్రైనింగ్: మంత్రి వివేక్ వెంకటస్వామి**

**- రుద్రంగిలో రూ.45 కోట్ల ఏటీసీ భవనానికి భూమిపూజ.. రూ.40 లక్షల సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన**

రుద్రంగి మండలం/ ఆగస్టు 4 ప్రజాదివాస్

అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల (ఏటీసీ) ద్వారా యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాలు, గనులు, భూగర్భ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు.ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌తో కలిసి రూ.45 కోట్ల వ్యయంతో నిర్మించనున్న అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ భవన నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. అనంతరం ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో రూ.40 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఉపాధి కల్పన మరియు శిక్షణ శాఖ డైరెక్టర్ ఐఏఎస్ ఏ. నిర్మల క్రాంతి వెస్లీ, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి. గితె పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రూ.4,000 కోట్లతో తెలంగాణ వ్యాప్తంగా 65 అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. ఐటీఐలను ఆధునీకరిస్తూ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్య శిక్షణ అందిస్తున్నామని పేర్కొన్నారు. గత రెండున్నరేళ్లలో లక్ష ఉద్యోగ అవకాశాలు కల్పించామని, ఏటీసీ విద్యార్థులకు నెలకు రూ.2 వేల స్టైపెండ్ అందిస్తున్నామని చెప్పారు.జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో ఉపాధి అవకాశాలను దృష్టిలో ఉంచుకుని విదేశీ భాషల శిక్షణ కూడా అందిస్తున్నామని మంత్రి వెల్లడించారు. రుద్రంగికి జర్మన్ భాషా శిక్షకుడిని పంపించి 100 మంది యువతకు విదేశీ ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వ్యవసాయ రంగంలో డ్రోన్ టెక్నాలజీ వినియోగాన్ని ప్రోత్సహించేలా ఏటీసీల్లో కొత్త కోర్సులు ప్రవేశపెడతామని తెలిపారు.ఈ నెల 15న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొత్త పెన్షన్లకు సంబంధించిన కీలక ప్రకటన చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. విద్య, వైద్యం, ఉపాధి, సంక్షేమ రంగాలకు ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రుద్రంగి ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. మూడపల్లిలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి



ఆలయ అభివృద్ధి, రోడ్డు విస్తరణ, మూలవాగుపై రెండో వంతెన నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ప్రస్తుత మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఏటీసీల్లో కోర్సులు రూపొందించామని తెలిపారు. ఏఐ, డ్రోన్ టెక్నాలజీ తదితర ఆధునిక రంగాల్లో శిక్షణ అందించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. నియోజకవర్గ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకుల తిరుపతి, ఆత్మ కమిటీ డివిజన్ చైర్మన్ ముకుంద రెడ్డి, ఆర్డీఓ కేవిఎస్‌బీ కుమారి, డీఎస్పీ శ్రీనివాసులు, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసాచారి, ఈఈ పీఆర్ సుదర్శన్ రెడ్డి, మైనింగ్ శాఖ ఏడీ క్రాంతి, తహసీల్దార్ పుష్పలత, ఎంపీడీఓ నటరాజ్, సర్పంచ్ గండి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# కొండాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు..

**- తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష: సర్పంచ్ వంకాయల గౌతమీ ప్రశాంత్..**



కోనరావుపేట మండలం / ప్రజాదివాస్ ఆగస్టు 04

కోనరావుపేట మండలం కొండాపూర్ గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ 'తల్లిపాల వారోత్సవాలు' మంగళవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు బాలింతలు మరియు గర్భిణులకు తల్లిపాల విశిష్టతపై విస్తృత అవగాహన కల్పించారు. తల్లిపాలు అమృతోపమానం ఈ సందర్భంగా సర్పంచ్ గౌతమి, ఏఎన్ఎం సుష్మ, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి మాట్లాడుతూ.. నవజాత శిశువులకు తల్లిపాలు అమృతంతో సమానమని పేర్కొన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే ఇచ్చే ముర్రుపాలు బిడ్డకు మొదటి టీకాగా పనిచేస్తాయని, పుట్టిన ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే అందించాలని సూచించారు. తల్లిపాల ద్వారా పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెరిగి భవిష్యత్తులో వచ్చే అనేక వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వంకాయల గౌతమి - ప్రశాంత్ తో పాటు వార్డు మెంబర్లు పూంద్ర లత, తాళ్లపల్లి సునంద, గంట కొమరవ్వలతో పాటు ఆశా వర్కర్ పుష్పల, అంగన్‌వాడీ సిబ్బంది, గర్భిణులు, బాలింతలు మరియు గ్రామ మహిళలు పాల్గొన్నారు.

# ఆరోగ్యవంతమైన తరానికి తల్లిపాలే తొలి అడుగు: సర్పంచ్ సండేసరి సౌజన్య మల్లికార్జున్

**- బొల్లారంలో ఘనంగా ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు**

**- శిశువుకు ముర్రిపాలే తొలి అమృతం.. అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు**

**- పోషకాహారం తీసుకోవాలి... చిన్నారుల ఆరోగ్యం కాపాడాలి: సర్పంచ్ సౌజన్య**





వేములవాడ / ప్రజాదివాస్ ఆగస్టు 04

వేములవాడ గ్రామీణ మండలం బొల్లారం గ్రామంలోని ప్రభుత్వ అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక సర్పంచ్ సండేసరి సౌజన్య మల్లికార్జున్ ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యత, పోషకాహార అవసరం మరియు శిశు సంరక్షణ చర్యలపై విస్తృత అవగాహన కల్పించారు. సమావేశంలో సర్పంచ్ సండేసరి సౌజన్య మల్లికార్జున్ మాట్లాడుతూ, ఆరోగ్యవంతమైన తరానికి తల్లిపాలే తొలి అడుగు అని స్పష్టం చేశారు. ప్రసవం జరిగిన వెంటనే, పుట్టిన గంటలోనే శిశువుకు ముర్రిపాలు పట్టించడం ఎంతో అవసరమని, అవి బిడ్డకు తొలి రోగనిరోధక శక్తిని అందించే అమృతం లాంటివని పేర్కొన్నారు. మొదటి ఆరు నెలల పాటు శిశువుకు కేవలం తల్లిపాలు మాత్రమే అందించాలని, ఆ తర్వాతే వైద్యుల సూచనల మేరకు ఇతర అదనపు పోషకాహారాన్ని ప్రారంభించాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా గుడ్లు, పాలు, ఆకుకూరలు వంటి సమతుల్య పోషకాహారం తీసుకోవడం వల్ల రక్తహీనత నివారించబడి, తల్లి ఆరోగ్యంతో పాటు శిశువు ఎదుగుదల కూడా మెరుగ్గా ఉంటుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహార పథకాలను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామంలోని చిన్నారులందరూ ఆరోగ్యంగా ఎదిగేలా తల్లిదండ్రులు సమయానికి టీకాలు వేయించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్, ఆయమ్మ, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల్లో సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలపై చైతన్యం పెంచాలి.

**- రుద్రంగి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ.**





రుద్రంగి మండలం / ప్రజాదివాస్ ఆగస్టు 04

గ్రామీణ ప్రాంత ప్రజలకు, యువతకు సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, గంజాయి వల్ల కలిగే అనర్థాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి వారిలో చైతన్యం తీసుకురావాలని జిల్లా ఎస్పీ అధికారులకు సూచించారుమంగళవారం రోజున రుద్రంగి పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆకస్మికంగా తనిఖీ చేసి స్టేషన్‌లోని వివిధ రికార్డులు, కేసుల నిర్వహణ, స్టేషన్ పరిసరాలు, విధుల నిర్వహణ తీరును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈసందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ...శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతి పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరిస్తూ ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా సేవలు అందించాలని, విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.గ్రామాల్లో రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ నిర్వహణను మరింత పటిష్ఠం చేయాలని,అలాగే రౌడీషీటర్లు, గంజాయి, పేకాట, ౹ాణూ బియ్యం అక్రమ రవాణా వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించాను. గ్రామాలను తరచూ సందర్శిస్తూ ప్రజలకు,యువతకి గంజాయి వలన కలుగు అనర్థాలపై,సైబర్ నేరాలపై , రోడ్డు ప్రమాదలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.నేను సైతం కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో సీసీ కెమెరాల ప్రాముఖ్యతను ప్రజలకు వివరించి, నేరాల నియంత్రణ, కేసుల ఛేదనలో వాటి పాత్రను తెలియజేస్తూ సీసీ కెమెరాల ఏర్పాటులో ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు.ఎస్పీ వెంట డిఎస్పీ శ్రీనివాసులు, సి.ఐ రవీందర్, ఎస్.ఐ మోతిలాల్, సిబ్బంది ఉన్నారు.

# ఆరోగ్యవంతమైన తరానికి తల్లిపాలే తొలి అడుగు

**- కౌన్సిలర్ కొండ్లెపు ముత్యం..**

**- వేములవాడ 17వ వార్డులో తల్లిపాల వారోత్సవాలు..**

వేములవాడ / ప్రజాదివాస్ ఆగస్టు 04

వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో మంగళవారం జాతీయ తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యత, పోషకాహారం అవసరం, శిశు సంరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ కొండ్లెపు ముత్యం పాల్గొని మాట్లాడారు. గర్భిణీ స్త్రీలు గర్భధారణ కాలంలో తప్పనిసరిగా పోషక విలువలు అధికంగా ఉండే సమతుల్య ఆహారాన్ని తీసుకోవాలని ఆయన సూచించారు. సరైన పోషకాహారం తీసుకోవడం ద్వారా తల్లి ఆరోగ్యంతో పాటు గర్భంలోని శిశువు ఎదుగుదల కూడా మెరుగ్గా ఉంటుందని తెలిపారు. ప్రసవం అనంతరం తల్లిపాలు శిశు వుకు తొలి రోగనిరోధక శక్తిని అందించే అమూల్యమైన ఆహారమని, పుట్టిన గంటలోపే తల్లిపాలు పట్టించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. అలాగే శిశువుకు తొలి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, ఆ తర్వాత వైద్యుల సూచనల మేరకు అదనపు పోషకాహారాన్ని ప్రారంభించాలని వివరించారు. చిన్నారులు ఆరోగ్యంగా ఎదగాలంటే సమతుల్య పోషకాహారం, పరిశు భ్రత, సమయానికి టీకాలు తప్పనిసరి అని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గర్భిణీలు, బాలింతలు, ఆరు సంవత్సరాల లోపు చిన్నారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గుడ్లు, పాలు, పోషకాహారం, ఇతర పోషకాహార పదార్థాలను అందిస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లి--శిశు సంక్షేమ పథకాలను ప్రతి అర్హ కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సిబ్బంది గర్భిణీలు, బాలింతలకు పోషకాహారం తీసుకోవాల్సిన విధానం, రక్తహీనత నివారణ, పరిశుభ్రత, శిశువుకు



తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. తల్లిపాలే శిశువుకు సంపూర్ణ ఆహారమని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తల్లి-శిశు ఆరోగ్య పరిరక్షణ అత్యంత కీలకమని వారు పేర్కొన్నారు.కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్వైజర్ అంజమ్మ,అంగన్‌వాడీ టీచర్లు, మిరియాల శోభ, అంగన్వాడి ఆయా విజయ, గర్భిణీ స్త్రీలు సితార, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎం సిబ్బంది, గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## నిమ్మపల్లి మూలవాగు ప్రాజెక్టుకు పొంచి ఉన్న ప్రమాదం.. 3 మీటర్ల మేర కుంగిన కట్ట!

**- కలిచివేస్తున్న వరద భయం: మూలవాగు ప్రాజెక్టు కట్ట కుంగడంతో దిగువ గ్రామాల ప్రజల ఆందోళన**

కొనరావుపేట మండలం / ప్రజాదివాస్ ఆగస్టు 04



సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండల పరిధిలోని నిమ్మపల్లి మూలవాగు ప్రాజెక్టుకు ముప్పు పొంచి ఉంది. ప్రాజెక్టు కుడి కాలువ కట్ట ఒక్కసారిగా కుంగిపోవడంతో ఏ క్షణాన ఏం జరుగుతుందోనని దిగువ ప్రాంతాల ప్రజలు, రైతులు తీవ్ర భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. గత వారం రోజులుగా కురిసిన భారీ వర్షాలకు కాలువ కట్ట కొంతమేర కుంగిపోయింది. ఆ సమయంలో ఇరిగేషన్ అధికారులు స్పందించి ఇసుక బస్తాలు వేసి తాత్కాలిక చర్యలు చేపట్టారు. అయితే, మంగళవారం నాటికి పరిస్థితి మరింత తీవ్రంగా మారి, కట్ట సుమారు మూడు మీటర్ల మేర లోతుకు కుంగిపోయింది. కట్ట బలహీనపడి ప్రాజెక్టుకు ఏదైనా విపత్తు వాటిల్లితే దిగువన ఉన్న గ్రామాలు జలమయం అయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట పొలాలు మునిగిపోవడంతో పాటు తీవ్ర ఆస్తి, ప్రాణ నష్టం జరిగే అవకాశముందని వాపోతున్నారు. అధికారులు కేవలం తాత్కాలిక ఉపశమన చర్యలకే పరిమితం కాకుండా, యుద్ధ ప్రాతిపదికన శాశ్వత మరమ్మత్తు పనులు చేపట్టి ప్రమాదాన్ని నివారించాలని గ్రామస్థులు, రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ ఆకస్మిక తనిఖీ

**- సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవు: మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి**

రాజన్న సిరిసిల్ల జిల్లా/ ప్రజాదివాస్ ఆగస్టు 04




సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయాన్ని చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయానికి వచ్చిన వెంటనే ఉద్యోగులు, అధికారుల హాజరు రిజిస్టర్లను, సమయపాలనను పరిశీలించారు. నిర్దేశిత సమయానికి విధులకు హాజరుకాని ఉద్యోగులు, ముందస్తు సమాచారం లేకుండా గైర్హాజరైన సిబ్బందిపై వెంటనే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, ప్రజలకు పారదర్శక సేవలు అందించడమే మున్సిపాలిటీ లక్ష్యమని తెలిపారు. ఉద్యోగులందరూ నిర్ణీత సమయానికి కార్యాలయానికి వచ్చి విధుల్లో పాల్గొనాలన్నారు. పనుల నిమిత్తం వచ్చే పట్టణ ప్రజలతో దురుసుగా ప్రవర్తించినా, విధుల్లో నిర్లక్ష్యం వహించినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అనంతరం వివిధ విభాగాల అధికారులతో సమీక్షించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పట్టణంలో పారిశుద్ధ్య పనులను వేగవంతం చేయాలని, కార్మికుల హాజరును క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని సూచించారు. ఇంజనీరింగ్ విభాగం ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై ఆరా తీశారు. రెవెన్యూ విభాగం ద్వారా ఇంటి, నీటి, వాణిజ్య పన్నుల వసూళ్ల వివరాలు, జనరల్ ఫండ్ జమ కావడంపై అధికారులతో చర్చించారు. టౌన్ ప్లానింగ్ విభాగం ఆధ్వర్యంలో అక్రమ కట్టడాల నిరోధానికి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## కార్మికులతో కలిసి మురికి కాలువ శుభ్రపరిచిన నాగాయపల్లి సర్పంచ్ చింతపంటి మల్లేశం

వేములవాడ / ప్రజాదివాస్ ఆగస్టు 04



వేములవాడ రూరల్ మండలం నాగయ్యపల్లె గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక మురికి కాలువ చుట్టూ చెట్లు, పొదలు పెరిగి మురుగు నీటి ప్రవాహానికి అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ చింతపంటి మల్లేశం కార్మికులతో కలిసి స్వయంగా కాలువలోకి దిగి చెట్లు, పొదలను తొలగిస్తూ శుభ్రపరిచే పనులు చేపట్టారు.సర్పంచ్ స్వయంగా పనుల్లో పాల్గొని కాలువను శుభ్రం చేయించడంతో మురుగు నీటి ప్రవాహం సాఫీగా మారింది. ప్రజా సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించేందుకు చొరవ చూపుతున్న సర్పంచ్ చింతపంటి మల్లేశాన్ని గ్రామస్తులు అభినందించారు.

# రైతుల ఖాతాల్లో 'వడ్ల పైసలు'.. రెండు నెలల నిరీక్షణకు తెర!

**- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చొరవ: 58 మంది రైతులకు రూ.52 లక్షల జమ**
**- ప్రభుత్వ విప్, మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన వకుళాభరణం శ్రీనివాస్**

వేములవాడ / ప్రజాదివాస్ ఆగస్టు 04

ధాన్యం కొనుగోళ్లలో జరిగిన పొరపాట్ల వల్ల గత రెండు నెలలుగా వేములవాడ మండల పరిధిలోని నూకలమర్రి, మరిపల్లి, మల్లారం గ్రామాలకు చెందిన 58 మంది రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ధాన్యం పక్కదారి పట్టి, ట్రక్ షీట్లు ఆన్‌లైన్‌లో నమోదు కాకపోవడంతో రూ.52 లక్షల వడ్ల డబ్బులు రైతుల ఖాతాల్లో జమకాక నిలిచిపోయాయి. రైతుల సమస్యను గుర్తించిన ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వెంటనే స్పందించారు. పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి



దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి మాట్లాడారు. మంత్రి ఆదేశాలతో 58 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా ధాన్యం డబ్బులు జమ కావడంతో ఎట్టకేలకు సమస్యకు ముగింపు లభించింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన కార్యదర్శి వకుళాభరణం శ్రీనివాస్ మాట్లాడుతూ... ధాన్యం డబ్బులు రాక రైతులు పడుతున్న బాధను గుర్తించిన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ప్రాథమిక సహకార సంఘం ద్వారా డబ్బులు చెల్లించేలా చూసినప్పటికీ ప్రక్రియ ఆలస్యమవుతుండటంతో నేరుగా మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో మాట్లాడారని తెలిపారు. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతోనే పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులు వేగంగా స్పందించి, రైతుల ఖాతాల్లో నేరుగా సొమ్ము జమ అయ్యేలా చర్యలు తీసుకున్నారన్నారు. రైతుల కష్టాన్ని తీర్చి, వారి ఖాతాల్లో నేరుగా డబ్బులు పడేలా చేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి రైతుల పక్షాన, గ్రామ ప్రజల పక్షాన వకుళాభరణం శ్రీనివాస్ మరియు స్థానిక కాంగ్రెస్ నాయకులు, రైతులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు. రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటారని ఆయన స్పష్టం చేశారు.

# సిరిసిల్ల ఆర్టీసీ డిపోలో రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన సదస్సు

**- సురక్షిత డ్రైవింగే ప్రయాణికుల ప్రాణాలకు శ్రీరామరక్ష: డీటీవో శ్రీనివాసరావు, డిప్యూటీ ఆర్ఎం భూపతిరెడ్డి**

రాజన్న సిరిసిల్ల జిల్లా / ప్రజాదివాస్ ఆగస్టు 04

సిరిసిల్ల ఆర్టీసీ డిపోలో మంగళవారం రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సదస్సుకు జిల్లా రవాణా అధికారి (డీటీవో) శ్రీనివాసరావు, డిప్యూటీ ఆర్ఎంలు భూపతిరెడ్డి, మల్లేశం, ఎంవీఐ వంశీధర్, ఏఎంవీఐలు పృథ్వీరాజ్ వర్మ, సాగర్, నిఖిల్, సిరిసిల్ల డిపో మేనేజర్ ప్రకాశరావు, వేములవాడ డీఎం శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల సహా మొత్తం 11 డిపోలకు చెందిన ఆర్టీసీ డ్రైవర్లు, ప్రైవేటు (హైర్) బస్సుల యజమానులు, డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీటీవో శ్రీనివాసరావు, డిప్యూటీ ఆర్ఎం భూపతిరెడ్డి డిజిటల్ స్లైడ్ల ద్వారా రోడ్డు ప్రమాదాలకు గల కారణాలు, ప్రమాదాల తీరు, వాటి వల్ల కలిగే నష్టాలు మరియు నివారణా చర్యలపై డ్రైవర్లకు దృశ్యరూపంలో అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ... వాహనాన్ని రోడ్డెక్కించే ముందే సాంకేతిక లోపాలు లేకుండా పూర్తిగా తనిఖీ చేసుకోవాలని సూచించారు. పరిమితికి మించిన వేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, డ్రైవింగ్ చేస్తూ సెల్‌ఫోన్ మాట్లాడటం లాంటి నిర్లక్ష్య సమానమైన పనులకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. నిద్రమత్తు, అలసట ఉన్న సమయంలో వాహనాలు నడపరాదని, ముఖ్యంగా



వర్షాకాలంలో రోడ్లు జారే ప్రమాదం ఉన్నందున మరింత అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే ప్రతీ డ్రైవర్ ప్రధాన బాధ్యతని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాద రహిత ఆర్టీసీగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు.

# రుద్రవరంలో మహిళా, బాలల సంరక్షణపై ప్రత్యేక గ్రామసభ

**- మహిళల భద్రత, బాలల హక్కుల పరిరక్షణకు అందరూ సహకరించాలి: సర్పంచ్ ఊరడీ సునీత రాజిరెడ్డి**

వేములవాడ / ప్రజాదివాస్ ఆగస్టు 04

వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం గ్రామపంచాయతీ ఆవరణలో మహిళలు మరియు బాలల సంరక్షణ, వారు ఎదుర్కొంటున్న సమస్యలపై మంగళవారం ప్రత్యేక గ్రామసభను నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఊరడీ సునీత రాజిరెడ్డి అధ్యక్షతన ఈ సమావేశం ఘనంగా జరిగింది. ముందుగా మహిళల రక్షణ, వారి హక్కులు మరియు ఎదుర్కొంటున్న సమస్యలపై మహిళా గ్రామసభలో విస్తృతంగా చర్చించారు. అనంతరం జెడ్పిహెచ్ఎస్, యుపిఎస్ పాఠశాలల విద్యార్థులతో కలిసి బాలల సంరక్షణ, హక్కులు మరియు బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ



సందర్భంగా సర్పంచ్ ఊరడీ సునీత రాజిరెడ్డి మాట్లాడుతూ... సమాజంలో మహిళలు, బాలల భద్రత మరియు సంక్షేమానికి తమ గ్రామపంచాయతీ ఎల్లప్పుడూ మొదటి ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని, ఎలాంటి సమస్యలు ఎదురైనా ధైర్యంగా ముందుకు వచ్చి అధికారులకు లేదా పంచాయతీకి తెలియజేయాలని కోరారు. చిన్నారుల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో పాటు సమాజంలో ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బాలల హక్కులను కాపాడుతూ, గ్రామాన్ని మహిళలకు, పిల్లలకు సురక్షితమైన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బెజగం మహేష్, వార్డు సభ్యులు ఎరుకల రజిత కిషన్ రెడ్డి, అలిపిరి సురేష్ రెడ్డి, పర్వతీ భూమేష్ గౌడ్, సంతపురి లావణ్య మహేందర్ రెడ్డి, తాడేం లతా శ్రీనివాస్, ఏరా గోక్కుల రేవతి బాలయ్య, కట్ట సంపత్, బాణాల రాజు, వంకాయల మహేశ్వర్, పంచాయతీ కార్యదర్శి, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, మహిళా సంఘాల ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, విద్యార్థులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# సంకెపల్లి ప్రాథమిక పాఠశాలలో 'బాలల గ్రామసభ'

**- బడి ఆవరణలో ఇంకుడు గుంతకు మార్కింగ్: సర్పంచ్ రెడ్డవేణి పరశురామ్**

వేములవాడ / ప్రజాదివాస్ ఆగస్టు 04

వేములవాడ అర్బన్ మండలం సంకెపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం బాలల గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రెడ్డవేణి పరశురామ్ మాట్లాడుతూ విద్యార్థుల చదువు, క్రమశిక్షణ, మధ్యాహ్న భోజనం నాణ్యత మరియు పరిశుభ్రతపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో చర్చించారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదివి సమాజంలో మంచి స్థానానికి చేరుకోవాలని కోరారు. అనంతరం వర్షాకాలాన్ని పురస్కరించుకుని భూగర్భ జలాల పెంపునకు, నీరు నిల్వ ఉండకుండా చూసేందుకు పాఠశాల ఆవరణలో ఇంకుడు గుంత నిర్మాణానికి మార్కింగ్ వేశారు. ఈ కార్యక్రమంలో సూపర్డెంట్ విజేందర్, వార్డు సభ్యులు నాగరాజు, కృష్ణవేణి, అజీజ్, ఉపాధ్యాయులు మాధవి, సంధ్యతో పాటు గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు



# వికాసిత్ భారత్ కార్యక్రమం విజయవంతం

సిరిసిల్ల/ ఆగస్టు 4 ప్రజా దివాస్

వికసిత్ భారత్ ఏ2047 లక్ష్య సాధనలో యువత కీలక పాత్ర పోషించాలి -- వక్తల పిలుపు"నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్" కార్యక్రమం విజయవంతం జేఎన్‌టీయూహెచ్ రాజన్న సిరిసిల్ల కళాశాలలో "నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ ఏ2047" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు ఈ కార్యక్రమానికి జేఎన్‌టీయూహెచ్ రాజన్న సిరిసిల్ల ప్రిన్సిపాల్ డా. టి. వేణుగోపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి. శంకరయ్య, జిల్లా యువజన అధికారి జి. తిరుపతి రెడ్డి, నషా ముక్త్ కార్యక్రమ నిర్వాహకులు అడ్వొకేట్ ఎ. సంతోష్ కుమార్,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ రంజిత్ కుమార్,కార్యక్రమ సమన్వయకర్త జి. శ్రవణ్, జిల్లా నోడల్ అధికారి శకుంతలాదేవి,గిరిజన సంక్షేమ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ లావణ్య ముఖ్య అతిథులుగా,హాజరయ్యారు.ముఖ్య అతిథులు






మాట్లాడుతూ,భారతదేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యవంతమైన, బాధ్యతాయుతమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు.ఇలాంటి సృజనాత్మక కార్యక్రమాలు యువతలో నాయకత్వ లక్షణాలు,సామాజిక బాధ్యత,దేశభక్తి మరియు సానుకూల దృక్పథాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.ప్రతి విద్యార్థి నషా ముక్త్ భారత్ – – వికసిత్ భారత్ ఏ2047" లక్ష్య సాధనలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా నిర్వహించిన డ్యాన్స్, సంగీతం, పెయింటింగ్, ఎలోక్యూషన్, స్లోగన్, నుక్కడ్ నాటక్, స్లామ్ పోయెట్రీ, రీల్/షార్ట్ ఫిల్మ్ తదితర మొత్తం 8 పోటీలలో సుమారు 200 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.పోటీలలో ప్రథమ, ద్వితీయ తృతీయ బహుమతులు ప్రదానం చేయగా, ప్రథమ స్థానం సాధించిన విజేతలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు.ఈ కార్యక్రమం యువతలో మాదకద్రవ్యాలపై అవగాహన పెంపొందించడంతో పాటు, వారి సృజనాత్మకత, సామాజిక చైతన్యం మరియు జాతీయ బాధ్యతను వెలికితీసే వేదికగా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, న్యాయ నిర్ణేతలు మరియు విద్యార్థులందరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

# విధులను బహిష్కరించిన వేములవాడ న్యాయవాదులు

- న్యాయవాదిని హత్య చేసిన దుండగులను శిక్షించాలి
- బార్ అసోసియేషన్ అధ్యక్షులు పిట్టల మనోహర్

వేములవాడ / ప్రజాదివాస్ ఆగస్టు 04



నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ కు చెందిన న్యాయవాది మల్లయ్యను కొందరు దుండగులు దారుణంగా హత్య చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు పిట్టల మనోహర్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి, ప్రధాన ద్వారం నినాదాలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ న్యాయవాదిని హత్య చేసిన దుండగుల కేసును ప్రభుత్వం ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి త్వరితగతిన విచారణ చేపట్టి దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు పొత్తూరు అనిల్ కుమార్, గుండ రవి, పెంట రాజు, న్యాయవాదులు రేగుల దేవేందర్, పర్లపెల్లి అంజయ్య, నక్క దివాకర్, మాదాసు దేవయ్య, జెట్టి శేఖర్, కనికరపు శ్రీనివాస్, గుజ్జె మనోహర్, నేదూరి అభిలాష్, బీమా మహేష్ బాబు, ఒద్యారపు వేణు కుమార్, వడ్లకొండ శ్రీకాంత్, పొత్తూరు మల్లేశం, వంగ పర్శరాములు, గోపు మధు తదితరులు పాల్గొన్నారు..

# జిల్లాలో డ్రగ్స్ ,గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు.

- ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో నార్కోటిక్ జాగిలంతో తనిఖీలు.
- డ్రగ్స్, గంజాయి క్రయ, విక్రయాల సమాచారం పోలీస్ వారికి అందించాలి.

ఎల్లారెడ్డిపేట మండలం / ప్రజాదివాస్ ఆగస్టు 04

మంగళవారం రోజున జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే ఆదేశాల మేరకు ఆర్.ఐ (అడ్మిన్) ఆధ్వర్యంలో నార్కోటిక్ జాగిలం సహాయంతో ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు కిరాణా షాప్,పాన్ షాప్స్,బస్టాండ్ , విద్యాసంస్థల పరిసరప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.

ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ...జిల్లాలో డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా, క్రయ, విక్రయాలను పూర్తిగా అరికట్టేందుకు పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందని తెలిపారు.అందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని పాన్ షాపులు, కిరాణా దుకాణాలు, బస్టాండ్‌లు వంటి ప్రజా రద్దీ ప్రాంతాలు, విద్యాసంస్థల పరిసరాల్లో నార్కోటిక్ జాగిలాల సహాయంతో తరచూ ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.మత్తు పదార్థాల వల్ల యువత భవిష్యత్తు దెబ్బతింటుందని పేర్కొంటూ, వాటి దుష్పరిణామాలపై ప్రజలు, విద్యార్థులు, యువతలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.డ్రగ్స్ లేదా గంజాయి విక్రయం, రవాణా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే



సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా తెలంగాణ ఈగల్ ఫోర్స్ హెల్ప్‌లైన్ 8712671111కు లేదా సమీప పోలీస్ అధికారులకు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు.జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.

# మల్లారంలో 'మియావాకీ' ప్లాంటేషన్: పాల్గొన్న సర్పంచ్ సంగం అర్పిత వీరారెడ్డి, అధికారులు

- పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి: మల్లారం సర్పంచ్ అర్పిత వీరారెడ్డి
- కార్యక్రమంలో పాల్గొన్న డీఆర్‌డీఓ, అధికారులు

వేములవాడ / ప్రజాదివాస్ ఆగస్టు 04



సిరిసిల్ల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామీణ మండలం మల్లారం గ్రామ పంచాయతీ పరిధిలో 'మియావాకీ' పద్ధతిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ, అటవీ శాఖాధికారి (ఎఫ్.ఎస్.ఓ), ఎక్సైజ్ శాఖ ఎస్.ఐలతో పాటు స్థానిక సర్పంచ్ సంగం అర్పిత వీరారెడ్డి పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ సంగం అర్పిత వీరారెడ్డి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ సూచనల మేరకు గ్రామంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు, పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ఈ మియావాకీ ప్లాంటేషన్ ఎంతో దోహదపడుతుందని తెలిపారు. తక్కువ స్థలంలో ఎక్కువ మొక్కలు పెంచే ఈ విధానం వల్ల గ్రామానికి ఆహ్లాదకరమైన వాతావరణం లభిస్తుందని పేర్కొన్నారు. నాటిన ప్రతి ఒక్క మొక్కను జాగ్రత్తగా కాపాడుకుని పెద్దవి చేసే బాధ్యతను గ్రామస్తులు, పంచాయతీ సిబ్బంది తీసుకోవాలని సర్పంచ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పాలకవర్గ సభ్యులు, పంచాయతీ సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# తెలంగాణ చౌక్‌లో సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు పాలాభిషేకం!

- 58 మంది రైతులకు రూ.52 లక్షల జమ: వేములవాడలో కాంగ్రెస్ శ్రేణులు, రైతుల సంబరాలు
- రైతులను ధర్నా పేరుతో మోసం చేసిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు: వేములవాడ మార్కెట్ కమిటీ ఛైర్మన్ రొండి రాజు విమర్శలు
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చొరవతో తీరిన ధాన్యం కష్టాలు: పాలాభిషేకం చేసిన నాయకులు, రైతులు



వేములవాడ / ప్రజాదివాస్ ఆగస్టు 04

ధాన్యం కొనుగోళ్ల సమస్య తీరి 58 మంది రైతుల ఖాతాల్లో రూ.52 లక్షల వడ్ల డబ్బులు జమ కావడంతో వేములవాడ గ్రామీణ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సోయినేని కరుణాకర్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణలోని స్థానిక తెలంగాణ చౌక్ వద్ద సంబరాలు నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు నాయకులు, రైతులు ఘనంగా పాలాభిషేకం చేసి తమ కృతజ్ఞతలు చాటుకున్నారు. గత రెండు నెలలుగా వేములవాడ మండల పరిధిలోని నూకలమర్రి, మరిపల్లి, మల్లారం గ్రామాలకు చెందిన 58 మంది రైతులు ధాన్యం డబ్బులు రాక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొనుగోళ్లలో జరిగిన కుంబకోణం వల్ల వడ్ల డబ్బులు నిలిచిపోగా, స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవ చూపి మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో మాట్లాడారు. ఫలితంగా పౌరసరఫరాల శాఖ అధికారులు స్పందించి రైతుల ఖాతాల్లో నేరుగా డబ్బులు జమ చేశారు.పాలాభిషేకం అనంతరం కాంగ్రెస్ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన కార్యదర్శి వకుళాభరణం శ్రీనివాస్ మాట్లాడుతూ... రైతుల కష్టాన్ని గుర్తించి వేగంగా స్పందించిన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆ తర్వాత వేములవాడ మార్కెట్ కమిటీ ఛైర్మన్ రొండి రాజు మాట్లాడుతూ... బిజెపి, బిఆర్ఎస్ నాయకులు రైతులను కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే వాడుకున్నారని విమర్శించారు. ఫ్యాక్స్ ఛైర్మన్‌గా ఉన్న బిఆర్ఎస్ నాయకుడు కలెక్టర్ వద్ద రూ.70 లక్షలు ఉన్నాయని చెప్పి, ఆ తర్వాత ముఖం చాటేసి బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారని మండిపడ్డారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చొరవతోనే రైతులకు న్యాయం జరిగిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రూరల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సోహినేని కర్ణాకర్, రూరల్ యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రోమాల ప్రవీణ్, వివిధ గ్రామాల సర్పంచులు, మల్లారం మాజీ ఎంపీటీసీ సంగం వీరారెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# టీబి రోగులకు న్యూట్రిషన్ కిట్ల పంపిణీ

ముస్తాబాద్/ ఆగస్టు 4 ప్రజా దివాస్




రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం పోతుగల్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ అఫీజ ఆధ్వర్యంలో టీ బి రోగులకు ఉచితంగా న్యూట్రిషన్ కిట్లను అందజేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీ బి రోగులు మంచి పౌష్టికాహారాన్ని తీసుకొని సమయానికి డాక్టర్ సలహా మేరకు మందులు వాడుకొని రోగాలను నయం చేసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో డాక్టర్ అఫీజా పీహెచ్ఎన్ జ్యోతి హెచ్.వి వరలక్ష్మి ఆశా వర్కర్స్ పాల్గొన్నారు

# కొండాపూర్ ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గం ఎన్నిక

- అధ్యక్షులుగా సాకలి బాబు



ముస్తాబాద్/ ఆగస్టు 4 ప్రజా దివాస్

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మండల అధ్యక్షులు కొమ్మెట రాజు సీనియర్ నాయకులు సుంచు మల్లన్న ఆధ్వర్యంలో కొండాపూర్ గ్రామంలో ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది అధ్యక్షులుగా చాకలి బాబు ఉపాధ్యక్షులుగా నాగెల్లి సతీష్ ప్రధాన కార్యదర్శిగా ఎర్రెల్లి బాబు కార్యదర్శి గంగి సతీష్ సంయుక్త కార్యదర్శి మార్వాడి సతీష్ కోశాధికారి వెంకటి అశోక్ ప్రచార కార్యదర్శి తాటిపల్లి భాను కార్యవర్గ సభ్యులు నాగలి సుధాకర్ నాగేల్లి ఉపేందర్ నాగేల్లి భాను ప్రసాద్ నాగేల్లి దినేష్ వెంకట్ సంజీవ్ వెంకట్ రాజు నాగలి చందు వెంకటి భయంకర్ ఎర్రెల్లి రాజు బొత్త భాస్కర్ సాకలి ఎల్లం లను నూతనంగా మండల అధ్యక్షులు ఆధ్వర్యంలో ఎన్నుకోవడం జరిగిందని ఎన్నికలకు సహకరించిన ఎమ్మార్పీఎస్ కుల బంధువులందరికీ కృతజ్ఞతలు తెలిపారు

# బిజెపి పోరాటంతోనే రూ.52 లక్షల ధాన్యం డబ్బులు విడుదల: చెన్నమనేని వికాసరావు

- వేములవాడలో చెన్నమనేని వికాస్ రావు ఆధ్వర్యంలో సంబరాలు



వేములవాడ / ప్రజాదివాస్ ఆగస్టు 04

రెండు నెలలుగా నిలిచిపోయిన ధాన్యం డబ్బులు ఎట్టకేలకు వేములవాడ రూరల్ మండల రైతుల ఖాతాల్లో జమ కావడంతో బిజెపి నాయకులు సంబరాలు నిర్వహించారు. నూకలమర్రి, మరిపల్లి, మల్లారం గ్రామాలకు చెందిన 58 మంది రైతులకు సంబంధించిన రూ. 52 లక్షల వడ్ల డబ్బులు ట్రక్ షీట్లు ఆన్‌లైన్‌లో నమోదు కాకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. బిజెపి చేపట్టిన నిరంతర పోరాట ఫలితంగానే కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి రైతులకు వడ్ల పైసలు విడుదల చేసిందని వేములవాడ బిజెపి నియోజకవర్గ ఇన్చార్జి చెన్నమనేని వికాసరావు స్పష్టం చేశారు. రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కావడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఆయన ఆధ్వర్యంలో వేములవాడ పట్టణంలోని తెలంగాణ చౌక్ ముందు బిజెపి శ్రేణులు టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం బిజెపి ఎల్లప్పుడూ ముందుంటుందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్, వేములవాడ పట్టణ, రూరల్ మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# జర్మన్ భాష శిక్షణ కేంద్రాన్ని పరిశీలించిన మంత్రి వివేక్



# ఎన్‌హెచ్-163పై అసంపూర్తి సర్వీస్ రోడ్లను వెంటనే పూర్తి చేయాలి

- ఎన్ హెచ్ ఏ ఐ చైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్‌ను కలిసి వినతిపత్రం అందజేసిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

ప్రజాదివాస్ ఆగస్టు 04

యాదాద్రివరంగల్ మధ్య జాతీయ రహదారి-163పై అసంపూర్తిగా ఉన్న సర్వీస్ రోడ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కోరారు. మంగళవారం న్యూఢిల్లీలో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) చైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ, హైదరాబాద్‌భూపాలపట్నం జాతీయ రహదారి (ఎన్‌హెచ్-163)లోని యాదాద్రివరంగల్ నాలుగు లేన్ల విస్తరణ పనుల సమయంలో నిడిగొండ, రఘునాథపల్లి, చాగల్, స్టేషన్ ఘన్‌పూర్, చిన్నపెండ్యాల, కరుణాపురం గ్రామాల పరిధిలో సర్వీస్ రోడ్లు నిర్మించినప్పటికీ, వాటి మధ్య పలు ప్రాంతాల్లో అనుసంధాన లింకులు మిగిలిపోయాయని తెలిపారు. జనగాం సమీపంలోని. 87/200 కి.మీ నుంచి నిడిగొండ వరకు, నిడిగొండ నుంచి రఘునాథపల్లి వరకు, రఘునాథపల్లి నుంచి చాగల్ వరకు, చాగల్ నుంచి స్టేషన్ ఘన్‌పూర్ వరకు, స్టేషన్ ఘన్‌పూర్ నుంచి చిన్నపెండ్యాల వరకు, చిన్నపెండ్యాల నుంచి కరుణాపురం వరకు ఉన్న సర్వీస్ రోడ్లలో లింకులు లేకపోవడం వల్ల స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య వివరించారు. ఈ కారణంగా స్థానిక వాహనాలు ప్రధాన జాతీయ రహదారిపైకి రావాల్సి వస్తోందని, దీంతో ట్రాఫిక్ రద్దీ పెరగడంతో పాటు రోడ్డు ప్రమాదాలు అధికమవుతున్నాయని ఎంపీ పేర్కొన్నారు. నాలుగు లేన్ల విస్తరణ సమయంలోనే సర్వీస్ రోడ్ల నిర్మాణానికి



అవసరమైన భూమి సేకరణ పూర్తయినందున, మిగిలిన లింకులను నిర్మించడంలో ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు. ప్రజల భద్రత, స్థానిక రవాణా సౌలభ్యం, గ్రామాల మధ్య మెరుగైన అనుసంధానం కోసం అసంపూర్తిగా ఉన్న సర్వీస్ రోడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఎన్‌హెచ్ఏఐ చైర్మన్‌ను కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన చైర్మన్ సంబంధిత అధికారులతో సమీక్షించి తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు ఎంపీ తెలిపారు.

# ఉరవకొండలో వైఎస్సార్‌సీపీ నాయకుల అరెస్టులు ప్రజాస్వామ్యానికి విరుద్ధం బత్తుల రామారావు ఖండన

ప్రజాదివాస్ ఆగస్టు 04

అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గంలో అధికార పార్టీ దౌర్జన్యాలు భూ ఆక్రమణలు పెరిగిపోయాయని ఆరోపిస్తూ ఉరవకొండ తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించి నిరసన కార్యక్రమం చేపట్టేందుకు సిద్ధమైన మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి పార్టీ కార్యాలయం వద్దనే పోలీసులు అరెస్టు చేయడం తీవ్రంగా ఖండిస్తున్నానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు పేర్కొన్నారు అదేవిధంగా ఈ నిరసన కార్యక్రమానికి సంఘీభావం తెలియజేయడానికి వచ్చిన మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ కూడా పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్టు చేయడం అత్యంత బాధాకరమని అన్నారు ప్రజాస్వామ్య దేశంలో ప్రజల సమస్యలపై శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ప్రతి రాజకీయ పార్టీకి ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని బత్తుల రామారావు పేర్కొన్నారు అలాంటి హక్కును పోలీసులు అడ్డుకోవడం ప్రతిపక్ష నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించాల్సింది పోయి వాటిని ప్రశ్నించే ప్రతిపక్ష నాయకులపై పోలీసు వ్యవస్థను ఉపయోగించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు భూ ఆక్రమణలు అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు



అక్రమ అరెస్టులకు పాల్పడిన అధికారులపై తగిన చర్యలు తీసుకోవడంతో పాటు అరెస్టు చేసిన వై. విశ్వేశ్వరరెడ్డి గోరంట్ల మాధవ్ వెంటనే విడుదల చేయాలని బత్తుల రామారావు ప్రభుత్వాన్ని కోరారు బత్తుల రామారావు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

# అభివృద్ధి సంక్షేమమే కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనకు ప్రతీక ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

ప్రజాదివాస్ ఆగస్టు 04

గత పాలకుల వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ కూటమి పాలనలో జరిగిన అభివృద్ధిని ఇంటింటికీ తీసుకెళ్తున్న ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

నందిగామ కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు గత పాలకుల వైఫల్యాలను ప్రజల దృష్టికి తీసుకెళ్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రజల్లోకి విస్తృతంగా వెళ్తున్నారు ఇందులో భాగంగా మంగళవారం నందిగామ పట్టణం 17వ వార్డులో కూటమి నేతలతో కలిసి డోర్ టు డోర్ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా వార్డులోని ప్రతి ఇంటిని సందర్శించి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్న



సంక్షేమ పథకాల వివరాలతో కూడిన కరపత్రాలను అందజేశారు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రజా సంక్షేమం నియోజకవర్గ అభివృద్ధికి ఇస్తున్న ప్రాధాన్యతను వివరించారు గత పాలకుల హయాంలో అభివృద్ధి పనులు నిర్లక్ష్యానికి గురయ్యాయని ప్రజా సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని పేర్కొంటూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి సమస్యను ప్రాధాన్యతా క్రమంలో గుర్తించి ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్తున్న తీరును ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రజలకు వివరించారు నందిగామ నియోజకవర్గ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుతూ ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులను పూర్తి చేస్తున్నామని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తెలిపారు. ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని అన్నారు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా డోర్ టు డోర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కూటమి నేతలు తెలిపారు ప్రజల ఆశీర్వాదంతో నందిగామ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని వారు పేర్కొన్నారు

# ఖాదర్ పేటలో ఎనిమిదో వార్డు బురద మార్గం నరకయాతన

- చీకట్లో వీధి దీపాలు లేక జారిపడి వార్డు ప్రజల విలవిల

-సి.సి రోడ్డు పనులు చేపట్టాలని, స్థానిక బిఆర్ఎస్ నాయకుడు పెండ్లి రాజు డిమాండ్...

ప్రజాదివాస్ ఆగస్టు 04

చెన్నారావుపేట మండలం పరిధి ఖాదర్ పేట 8వ వార్డులో వర్షాలకు బురదమయంగా మారి పగలు రాత్రి నడవలేక ప్రమాదాలకు గురవుతున్నామని, సమస్య పరిష్కరించాలని పెండ్లి రాజు పత్రిక ప్రకటనలో తెలిపారు. వీధిలైట్లు లేక చీకట్లో ఏది గుంతో ఏది బురదో గుర్తుపట్టలేక ఇబ్బందులు పడుతూ ప్రాణాలతో చేసే సాహసంగా మారిందన్నారు. గ్రామాభివృద్ధి పేరుతో సర్పంచ్ ఎన్నికల్లో గెలిచి ముఖం చాటేసినా గ్రామ సర్పంచ్ ఇప్పటికైనా కళ్ళు తెరవాలంటున్న 8వ వార్డు స్థానిక ప్రజలు ప్రాణాలతో చెలగాటం వద్దు. ప్రజల భద్రత కోసం సురక్షితంగా నడిచే రహదారి కావాలంటున్నారు.



ప్రజా దివాస్ తెలుగు దినపత్రిక TGTEL/25/A0827 05-08-2026

# కాజీపేట బ్రిడ్జి పనులను వెంటనే పూర్తి చేయాలి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా.పగడాల కాళీ ప్రసాద్ రావు



ప్రజాదివాస్ ఆగస్టు 04
భారతీయ జనతా పార్టీ హన్మకొండ జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో కాజీపేట బ్రిడ్జి నిర్మాణ పనులను వేగవంతం చేసి, పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన రాస్తారోకో కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పరకాల నియోజకవర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే డా.పగడాల కాళీ ప్రసాద్ రావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా డా. పగడాల కాళీ ప్రసాద్ రావు మాట్లాడుతూ,గత ఏడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఈ కీలకమైన కాజీపేట బ్రిడ్జి నిర్మాణ పనులు గత బీఆర్ఎస్ మరియు కాంగ్రెస్ ప్రభుత్వాల వైఫల్యాల కారణంగా పూర్తికాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు.ప్రజల రాకపోకలకు, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి అత్యంత కీలకమైన ఈ బ్రిడ్జి నిర్మాణాన్ని ప్రభుత్వం ఇకనైనా వేగవంతం చేసి, మిగిలిన పనులను వెంటనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు.ప్రజా సమస్యల పరిష్కారం కోసం భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన పోరాడుతుందని, ప్రజల హక్కుల సాధన కోసం తమ ఉద్యమాలు నిరంతరం కొనసాగుతాయని డా. పగడాల కాళీ ప్రసాద్ రావు తెలిపారు.

# ఆగస్టు 10 జైలు భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి సీఐటీయూ

ప్రజాదివాస్ ఆగస్టు 04
దమ్మపేట: కేంద్రంలోని మోడీ ప్రభుత్వం శ్రమజీవులపై దాడులను



తీవ్రతరం చేస్తోందని, ప్రజలకు అందుతున్న కొద్దిపాటి సబ్సిడీలను కూడా రద్దు చేస్తూ స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసమే పనిచేస్తోందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్ విమర్శించారు.ఆగస్టు 10న నిర్వహించనున్న జైలు భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం దమ్మపేట మండలంలోని పట్వారిగూడెం ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్ల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్మిక చట్టాలను సవరించి లేబర్ కోడ్లను అమలు చేయడం వల్ల కంపెనీల లాభాలు పెరుగుతున్నప్పటికీ కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించి నెలకు రూ.42 వేల కనీస వేతనం అమలు చేయాలని, 8 గంటల పని దినాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమించి, ఆగస్టు 10న జరిగే ప్రభుత్వ కార్యాలయాల దిగ్బంధనం, జైలు భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో సీఐటీయూ మండల కన్వీనర్ మురహరి రఘు, రామకృష్ణ, సునీత, శ్రీలత, సరోజిని, రాధ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# లింగగిరి 1.అంగన్వాడి కేంద్రంలో అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాలు

- సర్పంచ్: మెడబోయిన రజిత...

ప్రజాదివాస్ ఆగస్టు 04
చెన్నారావుపేట మండలం లింగగిరి – 1 అంగన్వాడీ కేంద్రంలో అంతర్జాతీయ తల్లి పాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించినారు.ఈ సందర్భంగా సర్పంచ్ మెడబోయిన రజిత మాట్లాడుతూ.. శిశువులకు



తల్లిపాలు అత్యంత శ్రేష్ఠమైన ఆహారమని తెలిపారు.పుట్టిన వెంటనే వచ్చే ముర్రుపాలు శిశువుకు మొదట వ్యాక్సిన్ లా పనిచేస్తాయని వాటిలో ఉండే పోషకాలు రోగనిరోధక శక్తి పిల్లల ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడతాయని వివరించారు.అంగన్వాడీ కేంద్రంలో తల్లులకు గుడ్లు, బాలమృతం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ ఇసంపెల్లి మమత ,అంగన్వాడీ టీచర్ ఇసంపెల్లి పుల్లమ్మ ,ఆయా కడగండ్ల పద్మ, తల్లులు,పిల్లలు పాల్గొన్నారు.

# ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ములుగు జిల్లా అధ్యక్షులు దుగ్గి చిరంజీవి.

తాడ్వాయి మండలం బంజారా ఎల్లాపూర్ గ్రామంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవం వారోత్సవాల్లో భాగంగా తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం ములుగు జిల్లా అధ్యక్షులు దుగ్గి చిరంజీవి మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసి దినోత్సవం ఆగస్టు 9 ఆదివాసి సంస్కృతి సాంప్రదాయాలు హక్కుల పరిరక్షణ దినమని, ఆనాడు ఆదివాసి ఉద్యమకారులు పోరాడు సాధించుకున్న హక్కులు చట్టాలు ఈరోజు కాలరాయపడుతున్నాయని అదే విధంగా ఇప్పటికే జీవో నంబర్ త్రీ ని నిర్వీర్యం చేశారని అదేవిధంగా 1/70 చట్టాన్ని కూడా నిర్వీర్యం చేయాలని చూస్తున్నారని పెసా చట్టానికి ఊపిరి అయినటువంటి గ్రామసభకు హక్కు లేకుండా చేశారని ఆయన మండిపడ్డారు. ప్రస్తుత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసి చట్టాలను నిర్వీర్యం చేయాలని చూస్తున్నాయని ఆదివాసులను చిన్నచూపు చూస్తున్నాయని ఆయన అన్నారు. 1/70 చట్టాన్ని రద్దు చేయాలని మరియు కొంతమేరకైనా మినహాయింపు కల్పించాలని 1700 మంది గిరిజనేతర్లు సుప్రీంకోర్టులో కేసు వేస్తే రాష్ట్ర ప్రభుత్వం ఇంప్లిఎడ్ కావలసిన బాధ్యత ఉన్నప్పటికీ ఏమాత్రం స్పందించకుండా నిమ్మకు నీరు ఎత్తనట్టుగా వైఖరిని కొనసాగిస్తు ఉన్నది ఇప్పటికైనా ఆదివాసి ముద్దుబిడ్డ అయినటువంటి మంత్రి సీతక్క గారు స్పందించి వెంటనే రాష్ట్ర ప్రభుత్వం తరపున సుప్రీంకోర్టులో ఇంప్లీడ్ కావాలని కోరుతున్నాము. ఇప్పటికే ఆదివాసి చట్టాలు ఉన్నప్పటికీని ఫిఫ్త్ షెడ్యూల్ ప్రాంతంలో వన్ ఆఫ్ చట్టానికి వ్యతిరేకంగా భూములు కబ్జాకు గురవుతున్నాయని ఆయన మండిపడ్డారు. ఇప్పటికైనా ఆదివాసి చట్టాలను ఏజెన్సీ ప్రాంతంలో పకడ్బందీగా అమలు చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రపంచ ఆదివాసి దినోత్సవానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గత సంవత్సరం లాగానే అధికారికంగా నిధులు కేటాయించి దినోత్సవాన్ని ఈ ఆదివాసీల



పండుగను జయప్రదం చేయాలని అన్నారు.ఆగస్టు 9 ఐటీడీఏ కేంద్రంగా జరుగు ఉత్సవాలని సంస్కృతి సాంప్రదాయాలతో కళానృత్యాలతో ప్రతి ఒక్క ఆదివాసి బిడ్డ ఏటూర్ నాగారం ఐటీడీఏ కేంద్రానికి హాజరై జయప్రదం చేయాలని అదేవిధంగా సంస్కృతి సాంప్రదాయాలను హక్కులను కాపాడుకునే విధంగా ఉద్యమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ కార్యదర్శి నాలి కార్తీక్ అధ్యక్షులు ఈసం విజయ్ కుమార్ సభ్యులు నాలి దిలీప్ గుమ్మడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు ఎమ్మెల్యే చేయూత..

-రూ.5 లక్షల ఎల్‌వోసీ మంజూరు
కుటుంబ సభ్యుల కృతజ్ఞతలు

ప్రజాదివాస్ ఆగస్టు 04
ఎల్లారెడ్డి నియోజకవర్గ ప్రజలకు అండగా నిలుస్తూ, ఆపదలో ఉన్న కుటుంబాలకు తక్షణ సహాయం అందిస్తున్న ఎమ్మెల్యే మదన్ మోహన్ మరోసారి తన సేవాభావాన్ని చాటుకున్నారు.తాడ్వాయి పట్టణానికి చెందిన మొహమ్మద్ జహిదాబీ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండగా, ఆమెకు అత్యవసర శస్త్రచికిత్స అవసరమని వైద్యులు సూచించారు. ఇప్పటికే వైద్య ఖర్చులతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబ సభ్యులు చికిత్స కొనసాగించేందుకు మార్గం లేక ఎమ్మెల్యే మదన్ మోహన్‌ను ఆశ్రయించారు.విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే స్పందించి, బాధితురాలి వైద్య చికిత్స కోసం రూ.5 లక్షల విలువైన ఎల్‌వోసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) మంజూరు చేయించారు. దీంతో శస్త్రచికిత్స, తదుపరి చికిత్సకు అవసరమైన ఆర్థిక భారం తగ్గి, కుటుంబ సభ్యులకు ఊరట లభించింది.ఈ సందర్భంగా మొహమ్మద్ జహిదాబీ కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే మదన్ మోహన్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. క్లిష్ట సమయంలో తమకు దేవుడిలా అండగా నిలిచారని భావోద్వేగంతో పేర్కొన్నారు. స్థానిక ప్రజలు కూడా ఎమ్మెల్యే తక్షణ స్పందనను అభినందిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన చూపుతున్న చొరవ, సేవాభావం ప్రశంసనీయమని పేర్కొన్నారు.




ప్రజా సేవనే లక్ష్యంగా తీసుకుని ప్రతి కుటుంబానికి భరోసాగా నిలుస్తున్న ఎమ్మెల్యే మదన్ మోహన్ సేవా కార్యక్రమాలు నియోజకవర్గంలో విశేషంగా చర్చనీయాంశంగా మారుతున్నాయి.

# వరంగల్ జిల్లా అభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణ, పారిశ్రామిక ప్రగతి పై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన కడియం కావ్య

– వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

ప్రజాదివాస్ ఆగస్టు 04
వరంగల్ జిల్లా అభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణ, పారిశ్రామిక ప్రగతికి సంబంధించి వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య లోక్‌సభలో ప్రశ్నించారు. పీఎం గతిశక్తి, ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రామ్, ఇతర కేంద్ర పథకాల కింద వరంగల్‌కు ప్రత్యేక అభివృద్ధి ప్రణాళిక ఉందా ఉంటే ఏయే ప్రాజెక్టులు మంజూరయ్యాయి వాటి ద్వారా జిల్లాకు ఎలాంటి ప్రయోజనాలు కలగనున్నాయో వెల్లడించాలని కేంద్ర ప్రభుత్వాన్ని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య కోరారు.వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.



వరంగల్ జిల్లాలో కనెక్టివిటీ మెరుగుపర్చేందుకు సుమారు 7,843 కోట్ల వ్యయంతో 447 కిలోమీటర్ల మేర మూడు రైల్వే ప్రాజెక్టులు, 6,133 కోట్ల వ్యయంతో 185 కిలోమీటర్ల మేర నాలుగు జాతీయ రహదారి ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. అలాగే పీఎం మిత్ర పథకం కింద 1,327 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్న బ్రౌన్‌ఫీల్డ్ టెక్స్‌టైల్ పార్క్‌కు సుమారు 1,696 కోట్ల వ్యయం కేటాయించినట్లు పేర్కొంది.ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ,వరంగల్ అభివృద్ధికి సంబంధించి కేంద్రం వద్ద ఉన్న ప్రణాళికలు, నిధుల కేటాయింపులు, అమలులో ఉన్న ప్రాజెక్టులపై స్పష్టత కోరినట్లు వెల్లడించారు. రైల్వే, జాతీయ రహదారులు, టెక్స్‌టైల్ పార్క్ వంటి ప్రాజెక్టులు పూర్తయితే జిల్లాలో పారిశ్రామిక వృద్ధి, ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతాయి" అని ఎంపీ తెలిపారు.అలాగే, "వరంగల్‌కు మంజూరైన ప్రాజెక్టులు వేగంగా పూర్తయ్యేలా కేంద్రంపై నిరంతరం ఒత్తిడి తీసుకువస్తానని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన అభివృద్ధి పనులు కాగితాలకే పరిమితం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వం పైన ఉంది అని కడియం కావ్య పేర్కొన్నారు.

# నెక్కొండ తహసిల్దార్ వేముల రాజ్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా పండ్ల మొక్కను నాటించిన వన ప్రేమికుడు సమ్మయ్య

ప్రజాదివాస్ ఆగస్టు 04
నెక్కొండ తహసిల్దార్ వేముల రాజ్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా అంతర్జాతీయ హరిత మిత్ర అవార్డు గ్రహీత వన ప్రేమికుడు నల్లగొండ సమ్మయ్య కార్యాలయం ఆవరణలో నేరేడు రావి కొన్ని పూల మొక్కలను నాటించడం జరిగింది. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ..వన ప్రేమికుడు పర్యావరణం ;పరిరక్షణ కొరకు పాటుపడుతూ.. స్వయంకృషితో మొక్కలను తెచ్చి నాటించి సంరక్షణ చేసి చెట్లను పెంచడం ఇతనీ సేవ ముందు తరాలకు ఆదర్శనీయమని సమ్మయ్యను అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసిల్దార్ పల్లకొండ రవి సీనియర్ అసిస్టెంట్ శ్యామ్ జూనియర్ అసిస్టెంట్ కర్ణ కంటి రాజేష్, లక్ష్మి, పాషా తదితరులు పాల్గొన్నారు.



## ఇదంతా అభిమానుల చలవే.. ప్రేమతో మీ ధనుష్!



72వ జాతీయ పురస్కారాలుధనుష్‌కు రెండింతల ఆనందాన్ని తీసుకొచ్చాయి. ఆయన దర్శకత్వంలో వచ్చిన 'రాయన్' ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా (తమిళ) ఎంపికవడంతో పాటు.. 'కెప్టెన్ మిల్లర్')తో ధనుష్ స్పెషల్ మెన్షన్ (నటుడు) గౌరవాన్ని పొందిన సంగతి తెలిసిందే. దర్శకుడిగా జాతీయ స్థాయిలో తొలిసారి అవార్డును సొంతం చేసుకోవడం, నటుడిగా నాలుగోసారి జ్యూరీ గుర్తింపును పొందడంపై ధనుష్ ఆనందం వ్యక్తం చేశారు. ఎంపిక కమిటీకి, అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. ఇన్‌స్టా పోస్టులో తన భావాలను ఇలా పంచుకున్నారు.''ఓం నమశ్శివాయ..! జాతీయ పురస్కారాల్లో 'రాయన్' ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా ఎంపిక కావడంతో పాటు, 'కెప్టెన్ మిల్లర్'తో స్పెషల్ మెన్షన్( నటుడు) గుర్తింపు దక్కడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తోంది. ఈ సందర్భంగా జాతీయ చలనచిత్ర అవార్డుల జ్యూరీకి, ఎంపిక కమిటీకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. కెరీర్ తొలినాళ్ల నుంచి మద్దతుగా నిలిచిన మీడియాకు ధన్యవాదాలు. నటుడిగా ఇది నాకు నాలుగో జాతీయ అవార్డు కాగా, దర్శకుడిగా మొట్టమొదటిది. నాకు ఇంత శక్తినిచ్చి, నా ఎదుగుదలకు మూలస్తంభాలుగా నిలిచిన నా అభిమానులే లేకపోతే ఇవేవీ సాధ్యమయ్యేవి కావు. అందుకు వారికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుతున్నాను'' 'కెప్టెన్ మిల్లర్'కు వచ్చిన గుర్తింపు మరింత ప్రత్యేకమైనది. ఎందుకంటే ఇప్పటివరకూ నేను అత్యుత్తమ నటన కనబర్చింది ఈ చిత్రంలోనే అని మొదటినుంచి బలంగా విశ్వసిస్తున్నాను. నా మనసుకు అంత దగ్గరైన పాత్రకు ఇప్పుడు స్పెషల్ మెన్షన్ గౌరవం దక్కడంతో ఈ విజయం మరింత అర్థవంతంగా మారింది. అలాగే మొదటి విజయం ఎప్పటికీ మర్చిపోలేనిది. 'రాయన్'తో దర్శకుడిగా దక్కిన తొలి జాతీయ పురస్కారాన్ని జీవితాంతం విలువైన జ్ఞాపకంగా దాచుకుంటాను. మన ఆలోచనలను బట్టే మన జీవితం ఉంటుందనే మాటను ప్రతిసారీ చెబుతుంటాను. ఈ సందర్భంలోనూ అదే మాటను గుర్తుచేసుకుంటున్నాను. హర్ హర్ మహాదేవ్! ప్రేమతో మీ ధనుష్'' అని ఆయన తన ఆనందాన్ని పంచుకున్నారు.

# 'రామాయణ' చిత్రం భారతదేశం కల: యశ్



'రామాయణ' చిత్ర బృందం

"మన శ్రీరాముడి కథని.. గ్లోబల్ వేదికపై నిలబెట్టాలి.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులకు చూపించాలనే ఉద్దేశంతో చేసిన చిత్రమే 'రామాయణ" అన్నారు నటుడు, నిర్మాత యశ్. నితేశ్ తివారీ దర్శకత్వంలో ముస్తాబైన ఈ ప్రతిష్ఠాత్మక చిత్రంలో రాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయిపల్లవి నటించిన సంగతి తెలిసిందే. యశ్ ఇందులో రావణుడి పాత్రను పోషిస్తూనే.. నమిత్ మల్హోత్రాతో కలిసి స్వయంగా నిర్మించారు. ఈ సినిమా రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుండగా.. 'రామాయణ: పార్ట్ 1' దీపావళి సందర్భంగా నవంబరులో విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే ఈనెల 24న ట్రైలర్ విడుదల చేయనున్నారు. దీనిలో భాగంగా శనివారం దిల్లీలో ప్రథమ్ సంకల్ప్ పేరుతో వేడుకను నిర్వహించి.. ట్రైలర్‌ని ప్రత్యేకంగా ప్రదర్శించారు. "ఇది కేవలం సినిమా కాదు. భారతదేశం కల. ఆ కలని నిజం చేయడం కోసం మేమంతా కలిశాం" అన్నారు నటుడు, నిర్మాత యశ్. ఈ కార్యక్రమంలో రణ్‌బీర్, సాయిపల్లవి, రకుల్ ప్రీత్ సింగ్, వివేక్ ఒబెరాయ్, సన్నీ దేఒల్, శోభన తదితరులు పాల్గొన్నారు.

## సోషల్ మీడియాలోకి తిరిగి రావాలనే ఆలోచనే లేదు: ఐశ్వర్య



ప్రస్తుతం 'గట్టా కుస్తీ 2' విజయాన్ని ఆస్వాదిస్తున్న నటి ఐశ్వర్య లక్ష్మి వరుస ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నారు. ఇందులో బాలీవుడ్ ఎంట్రీ సహా రెండు వెబ్ సిరీస్‌లు, ఒక ఫిమేల్ లీడ్ తమిళ సినిమాలో నటిస్తున్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఫెమినిజం, సోషల్ మీడియా, కామెడీ, తన రాబోయే చిత్రాల గురించి పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు."గట్టా కుస్తీ 2' సినిమా బాక్సాఫీస్ కలెక్షన్ల వివరాలను ఎప్పటికప్పుడు నా టీమ్ తెలియజేస్తూ ఉంటుంది. వీటికన్నా కూడా ప్రేక్షకులు సినిమా ఆస్వాదించడమే నాకు అసలైన సంతృప్తి. థియేటర్లలో వారు నవ్వుతుంటే అదే మాకు ఆనందం. దాని కోసమే కదా మేం కష్టపడేది. 'గట్టా కుస్తీ 2' చక్కటి వినోదాన్ని పంచుతూనే స్త్రీ, పురుష సమానత్వాన్ని ప్రతిబింబిస్తుంది. ఒక మహిళ తన కలలను సాకారం చేసుకోవడానికి పురుషుడు ఏవిధంగా వెన్నంటి నిలిచాడన్నది ఈ చిత్ర కథాంశం. ప్రియాంక చోప్రానే తీసుకోండి.. భర్త నిక్ జోన్స్ ప్రతి విషయంలో ఆమెకు అండగా ఉంటాడు. మా మూవీ కూడా ఇదే చెబుతుంది""నాకు సినిమాల్లో కామెడీ సన్నివేశాలు చేయడం ఇష్టం. కానీ, కామెడీ పండించడంలో నేను ఇంకా మెరుగుపడాలి. ఇప్పటివరకూ నేనెప్పుడూ సోషల్ మీడియాలో సురక్షితంగా ఉన్నట్లు అనిపించలేదు. అది లేకుండా పని చేయడం చాలా సులభం. ప్రస్తుతం సోషల్ మీడియాలోకి తిరిగి రావాలనే ఆలోచనే లేదు. గతంలో నా ఫొటోలను మార్ఫ్ చేయడం, కామెంట్లు పెట్టడం వల్ల అందరూ నన్ను ద్వేషిస్తున్నట్టు అనిపించేది. ఇప్పుడు ప్రజలను నేరుగా కలవడం సంతోషంగా ఉంది. రోజుకు రూ.100 కోట్లు ఇచ్చినా సోషల్ మీడియా దరిదాపుల్లోకి వెళ్లను. నా డాగ్ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా మాత్రమే వార్తలు, సినిమా అప్‌డేట్స్ చూస్తాను" అని ఐశ్వర్య పేర్కొన్నారు. ప్రస్తుతం ఐశ్వర్య ఆనంద్ దర్శకత్వంలో ఒక ఫిమేల్ సెంట్రిక్ తమిళ సినిమాలో పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్నారు. తర్వాత 'తీవినయ్ పొట్రు', 'లవ్' అనే రెండు వెబ్ సిరీస్‌లు ఐశ్వర్య లక్ష్మి ఖాతాలో ఉన్నాయి. బాలీవుడ్‌లో కూడా ఆమె ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు సమాచారం. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన ఇంకా రాలేదు.

# పాత్ర ఏదైనా పరకాయ ప్రవేశమే



ఓ నాయికగా గ్లామర్ కంటే కథకు, వైవిధ్యమైన పాత్రలకు ప్రాధాన్యం ఇచ్చే తక్కువమంది నాయికల్లో యామీ గౌతమ్ ఒకరు. నాయికా ప్రాధాన్య చిత్రాల్లో సత్తా చాటే ఈ తార 'ఆర్టికల్ 370'లో పోషించిన ఇంటెలిజెన్స్ అధికారిణి జూనీ హక్సర్ పాత్రతో మరింత గుర్తింపు తెచ్చుకున్నారు. ఇప్పుడు ఈ పాత్రే ఆమెని జాతీయ ఉత్తమ నటిగా నిలబెట్టింది. జమ్మూకశ్మీర్‌లోని ఆర్టికల్ 370 రద్దుకు సంబంధించిన అత్యంత కీలకమైన ఆపరేషన్‌లో ఇంటెలిజెన్స్ అధికారిణిగా దేశభక్తిని చాటుతూ.. భావోద్వేగమైన సందర్భాలలో కూడా పాత్రలో గంభీరతని ప్రదర్శించి, ఉత్కంఠభరితమైన యాక్షన్ సన్నివేశాలతో సినీప్రియుల్ని ఆకట్టుకున్నారు. నిశ్శబ్ద సన్నివేశాల్లో కళ్లతోనే కట్టిపడేశారామె. 'నేను ఎంచుకునే సినిమాలు ప్రస్తుత సంఘటనలతో ముడిపడి ఉంటున్నాయేమో అందుకే సామాజిక మాధ్యమాల్లో నన్ను విమర్శిస్తున్నారు'అని చెప్పే యామీ ఇటీవలే 'హక్' చిత్రంలో షాజియా పాత్రలో కనిపించి తన నటనతో ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నారు. ఆమె ఎక్కువగా సీరియస్ పాత్రల్నే పోషిస్తుందని అనుకుంటున్న సమయంలో 'బాల' చిత్రంతో నవ్వులు పూయించిన నాయిక ఈమె. పాత్ర ఏదైనా కానీ అందులోకి పరకాయ ప్రవేశం చేయడమే యామికి తెలుసంటూ అందరిచేత ప్రశంసలు అందుకునే ఈ నాయిక ప్రస్తుతం వరుస చిత్రాలతో బిజీగా ఉంది.

# కొత్త అనుభూతినిచ్చే థ్రిల్లర్.. న్యూటన్స్ థర్డ్ లా



"ప్రేక్షకులకు ఓ కొత్త అనుభూతిని అందించే థ్రిల్లర్ సినిమా 'న్యూటన్స్ థర్డ్ లా" అన్నారు హీరో సుమంత్. ఈ చిత్రంపై తామంతా ఎంతో నమ్మకంగా ఉన్నామని.. ఇది కచ్చితంగా అందర్నీ మెప్పిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 'అనగనగా' విజయం తర్వాత ఈటీవీ విన్ సంస్థలో సుమంత్ చేసిన కొత్త చిత్రమే 'న్యూటన్స్ థర్డ్ లా'. రాజేశ్ కర్ణ దర్శకత్వం వహించారు. కె.హరీశ్ నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 31న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం హైదరాబాద్‌లో ఈ చిత్రం నుంచి "ధమ్ ధమ్.." అనే పాటని విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో సుమంత్ మాట్లాడుతూ.. "ఈ స్క్రిప్ట్ విన్న వెంటనే దీంట్లోని వినయ్, కార్తీక్ పాత్రలు చాలా బలంగా ఉండాలని చెప్పా. ఆ రెండు పాత్రలు అద్భుతంగా వస్తే సినిమా ఆడుతుందని చెప్పా. ఇప్పుడు విడుదలైన పాట ఆ రెండు పాత్రలపైనే ఉంటుంది. ఈ సినిమాలో ప్రతి పాత్రకీ చాలా ప్రాధాన్యత ఉంటుంది. 'అనగనగా'కి బెస్ట్ యాక్టర్ అవార్డు అందుకోవడం ఆనందంగా ఉంది. ఈ సందర్భంగా ఈటీవీ విన్‌కి ధన్యవాదాలు" అన్నారు. "ఇకపై థ్రిల్లర్ జానర్ గురించి మాట్లాడినప్పుడల్లా ఈ సినిమా పేరు తప్పకుండా వినిపిస్తుంది" అన్నారు దర్శకుడు రాజేశ్ కర్ణ. ఈటీవీ విన్ సాయికృష్ణ మాట్లాడుతూ.. "సుమంత్‌తో మా ప్రయాణం 'అనగనగా'తో మొదలైంది. ఇప్పుడీ సినిమాతో మా జైత్రయాత్రని కొనసాగిస్తామని నమ్ముతున్నాం" అన్నారు. ఈ కార్యక్రమంలో సింజిత్ యర్రమిల్లి, కె హరీశ్, కృష్ణ చైతన్య, వేదవ్యాస్, గౌతమ్, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.